RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| | | | | | |
|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 176 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం, జనవరి, 3, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 176 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, January, 3, 2026 | PAGES : 8 RS : 4 /- |



### తండ్రి కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి కుమ్సుసాన్ ప్యాలెస్‌ను

# సందర్శించిన జు-యే

**– ఉత్తర కొరియా తర్వాతి పాలకురాలిగా జు-యేను సిద్ధం చేస్తున్నారన్న ఊహాగానాలు**

ఢిల్లీ,: ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తె జు-యేను మరోసారి ప్రపంచానికి ప్రత్యేకంగా పరిచయం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా, కిమ్ తన తండ్రి (కిమ్ జోంగ్ ఇల్), తాత (కిమ్ ఇల్ సంగ్) భౌతిక కాయాలను భద్రపరిచిన పవిత్రమైన ‹కుమ్సుసాన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్‹ను కుమార్తెతో కలిసి సందర్శించారు. జు-యే ఈ ప్యాలెస్‌ను సందర్శించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా (కేసీఎన్ఏ) విడుదల చేసిన చిత్రాలలో కిమ్ కుటుంబం ప్రధాన వరుసలో నిలబడి నివాళులర్పించింది. ఇందులో కిమ్ జోంగ్ ఉన్, ఆయన భార్య రి సోల్ జు మధ్యలో కుమార్తె జు-యే నిలబడి ఉన్నారు.


**హైదరాబాద్,తెలంగాణ దిశ :**మూసీ పునరుజ్జీవనంతో హైదారబాద్ ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు, మెరుగైన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మూసీ పొడవునా గోదావరి నీటిని పారించి సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ క్రమంలో నిర్వాసితులకు పునరావసం కూడా కల్పిస్తామని అన్నారు. నిజాం ఎంతో ముందుచూ పుతో మూసీ పొడవునా మంచి కట్టడాలు కట్టి ఆదర్శంగా నిలిచారని అన్నారు. నిజాంలు నిర్మించిన ప్రాజెక్టులే హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని అన్నారు. గతంలో జలవనరులను కాపాడుకొనే ప్రయత్నాలు జరగలేదని విమర్శించారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో జరగిని చర్చలో సీఎం మాట్లాడారు. గతంలో జల వనరులను కలుషితం చేశారు. కబ్జాలతో ఫాంహౌస్‌లు నిర్మించారు. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారు. నిందితులపై ఉక్కుపాదం మోపాం. డ్రైనేజీలను కూలగొట్టాం. కాకతీయుల నుంచి నిజాం వరకు నదీ పరివాహకంలోనే ప్రాజెక్టులు చేపట్టారు. వరద ముంపు నుంచి నగరాన్ని రక్షించేందుకు 1922 నాటికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులు చేపట్టారు. ప్రపంచ దేశాలతో హైదరాబాద్ పోటీపడేలా నగరాన్ని నిజాంలు తీర్చిదిద్దారు. వారు చేసిన అభివృద్ధిని గత పాలకులు కనుమరుగు చేశారు. నదులను కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా మార్చారు. నగరంలోని మురుగుకాల్వలను మూసీకి కలిపారు. ఇలా కలుషితం చేయడంతో నల్గొండ జిల్లాలోని మూసీ పరివాహక ప్రజలు జీవించలేని దుర్భర పరిస్థితి నెలకొంది. ఆ పరిస్థితి నుంచి కాపాడాలని వేలాది మంది విజ్ఞప్తి చేశారని సిఎం తెలిపారు.



### మూసీ పునరుజ్జీవంతో నగరానికి

# మహార్దశ

- గోదావరి జలాలతో నిరంతరంగా ప్రవాహం
- మూసీ పరివాహకరంలో నైట్ బజార్ల అభివృద్ధి
- నిర్వాసితులకు పక్కా ఇళ్లు కట్టించి ఇస్తాం
- మూసీ పొడువునా ఎలివెటెడ్ కారిడార్ల నిర్మాణం
- అంతర్జాతీయ కన్సల్టెంట్లతో ప్రణాళికలు
- డిపిఆర్ సిద్ధం కాగానే ఎమ్మెల్యేలకు వివరణ
- కొందు కావాలనే మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- అసెంబ్లీలో మూసీ అభివృద్ధిపై సిఎం రేవంత్ వివరణ




### హైదరాబాద్ శివారులో..

# దట్టమైన పొగమంచు

**స్తంభించిన ట్రాఫిక్**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ శివారుప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజా మునదట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రతఎక్కువగా ఉండటంతోరోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగరశివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జున సాగర్ హైవే, మేడ్చల్, తూం కుంట,శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కొన్నారు. పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్ పోర్టుమార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు.



### పుతిన్ నివాసంపై

# డ్రోన్ దాడులు

**– అమెరికాకు ఆధారాలు సమర్పించిన రష్యా**
**– ట్రంప్ చర్యలకు విఘాతంగా మారిన పరిస్థితులు**

మాస్కో,జనవరి2:యుద్ధం ముగించేందుకు ప్రయత్నా లు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఉద్రిక్తతలను మరింత పెంచేదిగా మారింది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పా ల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. దాడి నిజమేనని నిరూపించుకునే పనిలో పడింది రష్యా. ఇందులోభాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది.




### కేఎల్‌ఆర్ కాలేజీ బస్సు ప్రమాద సంఘటనపై సమగ్ర విచారణ

# జరిపించాలి...

**ఇలాంటి ప్రమాద సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి**

**భద్రాద్రి కొత్తగూడెం,తెలంగాణ దిశ :** ఒఎల్‌ఆర్ కాలేజీ బస్సు ప్రమాద సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలనీ ఇలాం టి ప్రమాద సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించా లనీ బాధితులకు న్యాయం చేయాలనీ మణుగూరు ఏరియా సామాజిక సేవకులు కర్నే బాబురావు ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు శుక్రవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం మొండికుంట అటవీ ప్రాంతంలో కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల బస్సు బోల్తా సంఘటన నేపథ్యం లో సమాచారం తెలుసుకున్న మణుగూరు ఏరియా సామాజిక సేవకులు కర్నే బాబురావు సంఘటన ప్రాంతాన్ని సందర్శించి అనంతరం భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని విద్యార్థులను ఆయన పరామర్శించారు



### యూరియా కొరతపై వాయిదా

# తీర్మానం

**తిరస్కరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రెండోరో జు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. యూరియా కొరతపై చర్చ జరపాలంటూ బీఆర్‌ఎస్ సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.
బీఆర్‌ఎస్ సభ్యుల నిరసనపై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.సభలో ఇలా చేయడం సరికాద న్నారు. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రతీ అంశంపై జవాబు చెబుతామని తెలిపారు. ప్రశ్నోత్త రాలు జరుగుతున్నాయని...
ముఖ్యమైన అంశాలపై చర్చించాల్సి ఉందన్నా రు. సభకు సహకరించాల్సిందిగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను మంత్రి శ్రీధర్ కోరారు. సభ్యుల ఆం దోళనల నడుమే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. యూరియా కొరతపై చర్చించాలంటూ ప్ల కార్డ్స్ ప్రదర్శిస్తూ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు.



# రేవంత్ భాష తీరు దారుణం

- కెసిఆర్‌ను ఉరి తీయాలంటారా?
- అలా అయితే రేవంత్‌ను పదిసార్లు ఉరితీయాలి
- హరీష్ రావు బబుల్ షూటర్ మాత్రమే
- మీడియాతో చిట్‌చాట్‌లో కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు. కేసీఆర్‌ను ఒకసారి ఉరితీయాలంటే రేవంత్ రెడ్డిని పదిసార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారు.శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కవిత మాట్లాడుతూ..ఈ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానాలు చెప్పకపోతే బీఆర్‌ఎస్ పని ఖతం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.



### 39 దేశాల నుంచి అమెరికాకు

# ఎవరూ వెళ్లలేరు

న్యూఢిల్లీ, జనవరి 2: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2026 జనవరి 1వ తేదీ నుండి అమలులోకి వచ్చేలా మొత్తం 39 దేశాలపై×× ప్రయాణ నిషేధాన్ని విధిస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడటం , ఉగ్రవాద ముప్పులను అడ్డుకోవడమే లక్ష్యంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రయాణ ఆంక్షల జాబితాను భారీగా పెంచారు. 2025 జూన్‌లో 19 దేశాలపై ఉన్న ఆంక్షలను ఇప్పుడు 39కి విస్తరించారు. అక్రమ వలసలను అరికట్టడం, వీసా నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. జనవరి 1, 2026 ఉదయం 12:01 గంటల నుండి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి.ఈ ఉత్తర్వులను ప్రభుత్వం రెండు భాగాలుగా విభజించింది. 19 దేశాలపై పూర్తి నిషేధం ఉండగా, మరో 20 దేశాలపై పాక్షిక నిషేధం అమలు చేస్తున్నారు. పూర్తి నిషేధం ఉన్న దేశాల పౌరులు ఎటువంటి వీసాలపై అమెరికాలో అడుగుపెట్టలేరు. పాక్షిక నిషేధం ఉన్న దేశాల పౌరులకు ఇమ్మిగ్రెంట్ వీసాలు, పర్యాటక (ః-1/ః-2),విద్యార్థి (ఈ,ఓ,ఏ) వీసాల జారీని నిలిపివేశారు. పూర్తి నిషేధం (19 దేశాలు + పాలస్తీనా): ఆఫ్ఘనిస్థాన్, బుర్కినా ఫాసో, బర్మా (మయన్మార్), చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లావోస్, లిబియా, మాలి, నైజర్, సోమాలియా, సౌత్ సూడాన్, సూడాన్, సిరియా, యెమెన్, సియెర్రా లియోన్, పాలస్తీనా అథారిటీ జారీ చేసిన డాక్యుమెంట్లు ఉన్నవారు.

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం**



### ఇవిఎంలపై దుమారం వేళ...

# కర్నాటకలో ఊహించని షాక్

**– ఇవిఎంల పనితీరుపై జనం సంతృప్తి వ్యక్తం...**

బెంగళూరు, జనవరి2 : ఇవిఎంలపై దుమారం రేపుతున్న కాంగ్రెస్‌కు అశనిపాతం లాంటి అనుభవం ఎదురయ్యింది. అది కూడా తమ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక నుంచే రావడం విశేషం. ఎన్నికల పక్రియలో విశ్వసనీయత, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచూ విమర్శలు వ్యక్తం చేస్తోన్న వేళ.. కర్ణాటకలో చేపట్టిన ఓ ప్రభుత్వ సర్వే ఫలితాలు చర్చనీయాంశం గా మారాయి. ఆ సర్వే లో రాష్ట్రం లోని మెజార్టీ ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ లను విశ్వసిస్తున్న ట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీపై భాజపా విమర్శలు గుప్పించింది. ఇవిఎంలను తప్పు పట్టడం ద్వారా రాహుల్ రాజకీయం బయటపడిందని విమర్శలకు పదను పెట్టింది.

# ప్రమాదాలు లేని సురక్షితమైన డ్రైవింగ్ చేయాలి

## - కుషాయిగూడ డిపోలో.. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు





**కుషాయిగూడ, జనవరి 02, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఘనంగా ప్రారంభమయ్యాయి. కుషాయిగూడ ట్రాఫిక్ ఎస్ఐ మధు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రజారవాణలో ముఖ్య భూమిక నిర్వహిస్తోందని అన్నారు. ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మంచి సేవలు చేస్తున్నారని అభినందించారు. ప్రమాదాలు లేని సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని ఆకాంక్షించారు. డ్రైవింగ్ చేసే సమయంలో పూర్తి శ్రద్ధ ఉంటే ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపును పొందుతారన్నారు. బస్సును నిలిపేటప్పుడు బస్సు బే లోనే ఆపాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను దాటేయాలని ఆత్రుతతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. కుషాయిగూడ ట్రాఫిక్ ఏఎస్ఐ నర్సింలు మాట్లాడుతూ మనం, మన కుటుంబ సభ్యులు క్షేమంగా రోడ్డుపై వెళ్లేవారు సురక్షితంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ విధులను కర్తవ్య దీక్షతో నిర్వహించాలని సూచించారు. కుషాయిగూడ డిపో మేనేజర్ మాట్లాడుతూ మానవ తప్పిదం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఎదురుగా వచ్చే వాహనాలను చూసుకుంటూ ప్రమాదాలను నివారించుకోవాలని సూచించారు. ఎదురుగా వస్తున్న వాహనాలను చూసుకొని సేఫ్ డ్రైవింగ్ తో పాటు రక్షణాత్మకంగా డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని అన్నారు. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో పాదాచారులు, వాహనాలు చూసుకుంటూ డ్రైవింగ్ చేయడమే ముఖ్యమన్నారు. మద్య పానాలు తీసుకోకుండా డ్రైవింగ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వేణుగోపాల్, కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నర్సింలు, ఎస్ ఐ జి. మధు, అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ వ్యాస్ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఈ. జనార్ధన్, బి. ఎలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలి

## - కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్



**ఏఎస్ రావునగర్, జనవరి 02, (తెలంగాణ దిశ) :**కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా శుక్రవారం పరమేశ్వర్ రెడ్డి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రజలందరూ సంపూర? ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళ కార్యకర్తలు భవాని, ఉషారాణి, సంధ్య, పద్మా, సునీత, భాగ్య, రాణి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# కుషాయిగూడ కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలి





**కుషాయిగూడ, జనవరి 02, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడ కాలనీల మీదుగా బసు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం కుషాయిగూడ బస్సు డిపో ఓస్ నర్సింహా రెడ్డికి కుషాయిగూడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. కుషాయిగూడ పరిసరాల్లో శుభోదయ కాలనీ, ఫేస్ 1,2,3, సోనియా గాంధీ నగర్ కాలనీ ఫేస్ 1,2,3, వాసవి శివ నగర్ కాలనీ, మీనాక్షి నగర్, న్యూ వాసవి శివనగర్ , ఎంఆర్ఆర్ కాలనీ, ద్వారక పురి కాలనీ, మధురానగర్ కాలనీ, మోడీ కాలనీ, గణేష్ నగర్ కాలనీ, వైష?వి ఎన్ క్లేవ్, మారుతి ఎన్ క్లేవ్, లక్ష్మి నర్సింహా కాలనీల వాసుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కుషాయిగూడ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ కాలనీల ప్రజలు నిత్యం బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, ఉద్యోగస్తులు, వృద్దులు తమ అవసరాల కోసం నిత్యం బస్సు కోసం రెండు కిలోమీటర్లు నడిచి కుషాయిగూడ బస్ స్టాప్ వద్దకు రావలసి వస్తుందని అన్నారు. స్థానికుల సౌకర్యార్థం వెంటనే మూడు బస్ లు 3కె,117, 17 బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. డిపో ఓస్ కూడా డిపో మేనేజర్ దృష్టికి తీసుక వెళ్లి వెంటనే ప్రజల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, సంయుక్త కార్యదర్శి సంయుక్త కార్యదర్శి నాలచెరువు జనార్ధన్, మీనాక్షి నగర్ కాలనీ అధ్యక్షులు సురేష్ గుప్త, నర్సింగ్ రావు, శుభోధయ కాలనీ మాజీ అధ్యక్షులు కాసుల నందం గౌడ్, లక్ష్మి నర్సింహా కాలనీ %೦%. సత్యం యాదవ్, నీరుడు బాబు, ఎన్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నందీశ్వర్ కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం చేసిన సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి



**ఏఎస్ రావునగర్, జనవరి 02, (తెలంగాణ దిశ) :**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జమ్మిగడ్డ దేవినగర్ కు చెందిన నందీశ్వర్ కుటుంబానికి శనివారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నందీశ్వర్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా జమ్మిగడ్డలోని దేవినగర్ లో గోపగాని స్వామి భార్య అరుణ ఇద్దరు కుమారులు శివ, నందీశ్వర్ తో కలిసి నివాసం ఉంటున్నారు. గత 20 ఏళ్ల క్రితమే నగరానికి వలస వచ్చిన స్వామి కుటుంబం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు నందీశ్వర్( 16) దూరవిద్యలో పదవ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో జై జవాన్ కాలనీ కమాన్ పక్కన గల టీ స్టాల్ వద్ద నందీశ్వర్ నిలబడి ఉండగా దమ్మాయిగూడ నుంచి రాధిక వైపు అతివేగంగా దూసుకు



వచ్చిన గుర్తు తెలియని కారు నందీశ్వర్ ను ఢీకొట్టింది. ఈ క్రమంలో నందీశ్వర్ కు తీవ్ర గాయాలు అవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జవహర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చేతికి అంది వచ్చిన కుమారుడు నందీశ్వర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

# ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్








**నాగారం, జనవరి 02, (తెలంగాణ దిశ) :**నాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. పదవ తరగతి విద్యార్థులు పార్లమెంట్ సమావేశాలు జరిగే విధానం తో పాటు పార్లమెంట్లో ప్రవేశపెట్టే పద్ధతిని అనుకరిస్తూ మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పిసి రాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రులుగా ఉపన్యాసాలు ఇవ్వడం, ప్రతిపక్ష సభ్యులుగా మంత్రులను ప్రశ్నించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలోనే అత్యున్నత సభ అయిన పార్లమెంటు సమావేశాలకు స్పీకర్ గా ప్రణీత్ చక్కగా అభినయం చేశాడు. మాక్ పార్లమెంట్ ద్వారా పాఠశాల విద్యార్థులు పార్లమెంట్ పై అవగాహన చేసుకున్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పద్మ, వందన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు వనజ, రాజ్యలక్ష్మి, రఘు, అజీజ్ అహ్మద్, శ్రీదేవి, సుమతి, మాలోత్ నాయక్, ఎ. సంధ్యారాణి, బి. సంధ్యారాణి, వరమ్మ, పాండురంగారెడ్డి, గాయత్రీ, సుప్రజ, సంజయ్ రాణీ, అర్చన, కౌసల్య, విద్యా వాలంటీర్ స్వప్న, శ్రీవిద్య, పావని, పవిత్ర, రోహిత్, సిబ్బంది పురుషోత్తమ రావు, సౌజన్య, లక్ష్మీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలలో కూచిపూడి నృత్యాల సందడి






**ఏఎస్ రావునగర్, జనవరి 02, (తెలంగాణ దిశ) :**వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కాప్రా సర్కిల్ డా. ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి. సంప్రదాయ కళారూపమైన కూచిపూడి నృత్యాల ద్వారా స్వామివారి లీలలు, పురాణ ఇతిహాస ఘట్టాలను ఆవిష్కరిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నక్షత్ర నాట్య నిలయం ఆధ్వర్యంలో అంకం శిరీష నేతృత్వంలో ఈ నృత్య కార్యక్రమం భక్తి రసంతో ఘనంగా జరిగింది. కళాకారులు తమ నైపుణ్యం, హావభావాలు, భావప్రకటనలతో స్వామివారి మహిమను చాటుతూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఆలయ ప్రాంగణమంతా భక్తిమయ వాతావరణంతో ఉత్సవ శోభను సంతరించుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమా-ప్రకాష్ రావు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ పీఏ, ఓఎస్డీ పరమేష్ శ్వర్-నీరజ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాకారుల ప్రదర్శనలను తిలకించి, సంప్రదాయ నృత్య కళను ఆదరిస్తూ కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా బ్రాహ్మంజలి, పూర్వారాగం, మూషిక వాహనం, మహాభారత ఘట్టాలు, అన్నమాచార్య కీర్తనలు, దేవీ స్తుతి సరస్వతి, పిబారే రామరసం, అంబ శాంభవి వంటి నృత్యాంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తాళలయ సమన్వయంతో కూడిన నృత్య కదలికలు, కళాకారుల భావప్రకటన ప్రేక్షకులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై నూతన సంవత్సరాన్ని భక్తి పరవశంలో జరుపుకున్నారు. సంప్రదాయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన ఈ కూచిపూడి నృత్య ప్రదర్శనలు నూతన సంవత్సర వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని భక్తులు అభిప్రాయపడ్డారు.

# బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నేటి నుంచి ఉద్యాన్ ఉత్సవ్ ప్రదర్శన



**బొల్లారం, జనవరి 02, (తెలంగాణ దిశ) :**హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన్ ఉత్సవ్ ప్రదర్శన ప్రారంభం కానుంది. జనవరి మూడవ తేదీ నుంచి 11వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు ఈ ఉద్యాన ఉత్సవ్ ప్రదర్శన కొనసాగునుంది. ఈ ఉత్సవాలను జనవరి మూడవ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్ గా ప్రారంభించనున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ సహకారంతో తొమ్మిది రోజులపాటు కొనసాగే ఈ ప్రదర్శన వివరాలను రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజినీ ప్రియ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ ద్వారా వివిధ శాఖలకు చెందిన అధికారులు వెల్లడించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ మేనేజ్ మెంట్ భాగస్వామ్యంతో ఉద్యాన, వ్యవసాయ రంగాలకు సంబంధించి స్థిరమైన ఉద్యాన పద్ధతులు, సుస్థిరమైన వ్యవసాయ విధానాలను వివరిస్తూ ఈ ప్రదర్శనలో స్టాల్స్ ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమై రాత్రి ఎనిమిది గంటల వరకు కొనసాగే ఈ ఉద్యాన ఉత్సవ్ ప్రదర్శనకు సందర్శకులకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో వివిధ ప్రాంతాలకు చెందినవారు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. ఉద్యాన, వ్యవసాయ రంగాలకు సంబంధించిన ఆధునిక పద్ధతులను వివరించేలా స్టాల్స్ ఉంటాయని చెప్పారు. ఈ ప్రదర్శన ద్వారా వ్యవసాయ రంగ నిపుణులు శాస్త్రవేత్తలు పాల్గొని అత్యాధునిక పద్ధతులపై రైతులకు వివరించనున్నట్లు చెప్పారు.



# టీఎన్జీఓస్ జిల్లా అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 02, (తెలంగాణ దిశ) :**తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీఎన్ జీఓస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాలెండర్ తో పాటు టేబుల్ క్యాలెండర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జి.వినోద్ కుమార్, అధ్యక్షుడు ఎ. కురుమూర్తి, కార్యదర్శి, ఉపాధ్యక్షుడు డి. రవీందర్, విజయ కుమారి, సాంబశివరావు, కిషన్, ఝాన్సీ, రఘునందన్ గౌడ్, ఆనంద్ రావు, సిహెచ్. రమేష్, ఇ.సత్యనారాయణ, శంకరయ్య, డాలీ తదితరులు ఇతరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## న్యాయమూర్తులపై పని ఒత్తిడి

మనదేశ జనాభాకు తగ్గట్లుగా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన తక్షణ అసవరం ఉంది. ఇప్పటికే కేసుల సంఖ్యపెరుగుతోంది. ఒక్కో కేసుకు దశాబ్దాల సమయం పడుతోంది. న్యాయమూర్తులపై ఒత్తిడి పెరుగుతోంది. రోజువారీ కేసులకే సమయం సరిపోవడం లేదు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మనదేశంలో సుప్రీంకోర్టుకు 34 మంది న్యాయమూర్తులు సరిపోతారా.. అనేది కీలక ప్రశ్న. ఇక హైకోర్టుల్లో 63 లక్షలకుపైగా, దిగువ కోర్టుల్లో దాదాపు ఐదు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ కేసులు కొండలా పేరుకుపోవడం ఆందోళనకరం. అత్యున్నత న్యాయస్థానం చరిత్రలోనే ఎన్నడూలేనంత అత్యధికంగా 88,417 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయం ఆలస్యం కావడమంటే న్యాయం జరగకపోవడమే అనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎందుకంటే అండర్ ట్రయల్ ఖైదీలు కేసులు తెమలక ఏళ్లుగా జైళ్లల్లో మగ్గుతున్నారు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కినా ఏళ్లతరబడి కేసులు తెమలడం లేదు. రాజకీయ కేసులు తప్ప క్రిమినల్ తదితర కేసులు తేల్చడం లేదు. ఈ క్రమంలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలి. సుప్రీం కోర్టు బెంచ్‌లను పెంచాల్సిన అవసరాన్ని గుర్తించాలి. కోర్టుల్లో తగినంతమంది న్యాయమూర్తులను, సిబ్బందిని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. లోక్ అదాలత్‌లు లాంటివి నిర్వహించి ఇరుపక్షాలు అంగీకరించిన కేసులను పరిష్కరిస్తే కోర్టులపై ఒత్తిడి తగ్గుతుంది. తీర్పులకు సమయం నిర్దేశిరచాలనే వాదన కూడా వుంది. న్యాయస్థానాలకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిన కేంద్రం అనేక సందర్భాల్లో అడ్డుపడటం, అడ్డగోలుగా విమర్శలు చేయడం పరిపాటిగా వుంది. న్యాయమూర్తుల నియామకానికి ప్రత్యేకంగా ఒక జ్యుడీషియల్ కమిషన్ ఉండాలన్న చర్చ చాలాకాలంగా వుంది. అయితే నేడు కొలీజియం వ్యవస్థ ఆ బాధ్యత నిర్వహిస్తోంది. కాని కేందప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం నియామకాలను తీవ్రంగా జాప్యం చేస్తోంది. ఏవో సాకులు చూపి తిరస్కరిస్తోంది. ఇంకొన్ని సందర్భాల్లో కొలీజియం, కేంద్ర న్యాయశాఖ మధ్య వివాదాస్పదం అవుతున్నవే వున్నాయి. భారత రాజ్యాంగం, పాలన, శాసన, న్యాయ వ్యవస్థల మధ్య స్పష్టమైన లక్ష్మణరేఖలను నిర్దేశించింది. పాలకులు వాటిని ఉల్లంఘించిన సందర్భాల్లోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. నాగరిక సమాజంలో సత్వర న్యాయం అందించడం వ్యవస్థ బాధ్యత. అందుకోసం సుప్రీంకోర్టు తీసుకుంటున్న చొరవకు కేంద్రం వీలైనంత తోడ్పాటు నందించాలి. అప్పుడే పెండింగ్‌కు అడ్డుకట్టపడటంతోపాటు సత్వర న్యాయం అందేందుకు అవకాశముంటుంది. ఎందుకంటే ఇటీవల హైదరాబాద్ జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీ కేసులో దాదాపు 17 ఏళ్ల నిరీక్షణ తరవాత పరస్పర విరుద్ధ తీర్పులు వచ్చాయి. జస్టిస్ ఎన్‌వి రమణ ఇచ్చిన తీర్పుకు భిన్నంగా మళ్లీ తదుపరి సిజెఐ తీర్పు వచ్చింది. దీనిపై అప్పీల్‌కు వెళితే కేసును కొట్టివేశారు. ఇది సమాజంలో ఓ పేదవర్గాల కోసం ప్రభుత్వం అనుసరించి గృహ సంబంధ విషయం. దీంతో జర్నలిస్టులు రోడ్డున పడ్డారు. ఇందులోని మెరిట్స్‌ను గుర్తించక పోవడంతో జర్నలిస్టులు ఆందోళనకు కారణమయ్యింది. కేసులో ప్రభుత్వం కూడా గట్టిగా వాదనలు ఇవ్వలేకపోయింది. జర్నలిస్టులకు 17 ఏళ్ల క్రితం ఎందుకు ఇంటి స్థలాలు ఇవ్వాల్సి వచ్చిందో ధర్మాసనం ముందుంచ లేపోయింది. కేసు వేసిన వారు సైతం జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను తెలుసు కోకుండా కోర్టుకు వెళ్లారు. ఇదంతా ఎందుకుంటే కేసు ఏదాదిలోనే తేలివుంటే సమస్య వచ్చేది కాదు. అప్పుడే ప్రభుత్వాలు తగిని నిర్నయాలు తీసుకునే వీలుండేది. కేవలం కోర్టుల్లో దశాబ్దన్నరం కాలంగా నలిగిపోచి చివరకు అన్యాయం జరగడంతో తమ సమస్యలపై నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం లోపం కూడా ఉంది. అందుకే కేసులు సత్వరంగా పరిష్కారం కావాలంటే న్యాయమూర్తుల సంఖ్యను ఇప్పుడున్న దానికి కనీసం పదివంతులు పెంచాలి. అప్పుడు త్వరగా పరిష్కారం దక్కుతుంది. జైళ్లలో మగ్గుతున్న ఎందరికో ఊరట కలుగుతుంది. లేకుంటే కేసులు తేలకుండానే ట్రయల్ ఖైదీలు జైళ్లల్లో మగ్గాల్సి వస్తోంది. జాతీయ జ్యుడీషియల్ గ్రిడ్ ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం 69,605 సివిల్, 18,887 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2020 వేసవి సెలవుల సమయంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రస్తుత సిజెఐ బిఆర్ గవారు వేసవి సెలవుల్లోనూ పాక్షికంగా పనిచేసే పద్ధతిని తీసుకొచ్చారు. కొల్‌కతా, మహారాష్ట్ర హైకోర్టుల్లో కేసుల పెండింగ్ అత్యధికంగా ఉంది. జనాభాతో పోల్చితే న్యాయమూర్తుల నిష్పత్తి ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే మనదేశంలోనే అత్యంత తక్కువగా ఉండటం కేసుల పెండింగ్‌కు కారణమవుతోందన్న వాదన ఉంది. . అమెరికాలాంటి దేశాల్లో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 150 మంది వరకూ న్యాయమూర్తులుండగా, మన దేశంలో 21 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. కోర్టుల్లో కేసులు భారీగా పెరిగిపోవడానికి అనేక కారణాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ కేసులతో న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దేశంలో కార్పొరేట్, అవినీతి, నేరగ్రస్థ రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. చట్టసభల సభ్యుల్లో 45 శాతం మందికిపైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాధాన్యతా క్రమంలో చట్ట సభల సభ్యులు, అధికారులపై కేసులను పరిష్కరించడం కూడా అత్యవసరం. ఇక ఇతర కారణాల విషయానికి వస్తే న్యాయవాదులు తరచూ వాయిదాలు కోరడం, స్థానికంగా పరిష్కరించదగినవి కూడా కోర్టులకు తీసుకురావడం తదితర కారణాల వల్ల అసంఖ్యాకంగా కేసులు పెరిగిపోతున్నాయి. రిటైర్డ్ న్యాయమూర్తుల సేవలు సివిల్ కేసుల విషయంలో వినియోగించుకుని సుదీర్ఘకాలంగా వాయిదాలున్న కేసుల సంగతి తేల్చాలనే సూచన ఉంది. ఏదేమయినా ఈ విషయంలో కేంద్రం ఇక ఎంతమాత్రం ఉపేక్షించకుండా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచి , కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రయత్నం చేయాల్సి ఉంది.


# కాప్రా డిసి శ్రీహరికి అభినందనల వెల్లువ





**ఏఎస్ రావునగర్, జనవరి 02, (తెలంగాణ దిశ)** :కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ అభినందనలు తెలిపారు. ఈ సందరరేగా ఆయనను ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందరరేగా డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ కార్యకర్తలు ఉషారాణి, భవాని, పద్మా, సంధ్య, సునీత, భాగ్య, రాణి పాల్గొని డిసీ శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపారు.

# సూర్య చంద్ర ఎంటర్ ప్రైజెస్ క్యాలెండర్ ఆవిష్కరణ



కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ సంస్థ ఐన సూర్య చంద్ర ఎంటర్ ప్రైజెస్ క్యాలెండర్ ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు.



ఈ కార్యక్రమంలో పిజి. సుదర్శన్, ఎం. బాలరాజ్ గౌడ్, టి.శ్రీకాంత్ రెడ్డి,వి. శ్రీనివాస్, కె. రాజేష్, హెచ్. మహేష్, ఎన్. సురేష్, కె. శివ, పాషా, విలాయత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

(మల్లాపూర్, తెలంగాణ దిశ)

# దేశీయ తొలి ప్రైవేట్ రాకెట్..

## హైదరాబాదీ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అరుదైన ఘనత




### వాణిజ్య ప్రయోగానికి స్కైరూట్ సిద్ధం

### భారత్‌లో ఇస్రో కాకుండా ఇతర సంస్థలకిదే మొదటిసారి

హైదరాబాద్,: దేశంలో అంతరిక్ష ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్ ఇస్రో. అయితే భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కున్న ఈ ఘనత ఇక ఎంతోకాలం కొనసాగకపోవచ్చు. అవును మరి. ఇస్రోను తక్కువ చేయడం కాదుగానీ.. హైదరాబాదీ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ ఓ వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్నది. భారత్‌లో ఈ తరహా తొలి ప్రైవేట్ రాకెట్ ఇదే కావడం విశేషం. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్.. స్కైరూట్ ఏరోస్పేస్ ఓఅరుదైన ఘనతను సాధించబోతున్నది. దేశంలోనే మొదటిసారి సొంతంగా ఓ వాణిజ్య రాకెట్‌ను తయారుచేసి ప్రయోగించబోతున్నది. వచ్చే 3 నెలల్లో ఈ భారత తొలి ప్రైవేట్, కమర్షియల్ రాకెట్ గగనతలంలోకి దూసుకుపోవచ్చని చెప్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాత్రమే ఈ తరహా ప్రయోగాలను చేస్తున్నది. అయితే ఇక స్కైరూట్ ఏరోస్పేస్ సైతం అందుకు వేదిక కాబోతుండటం గమనార్హం.

జనవరిలో..: ఇద్దరు మాజీ ఇస్రో శాస్త్రవేత్తల కంపెనీయే ఈ స్కైరూట్ ఏరోస్పేస్. వచ్చే ఏడాది జనవరిలో అంతరిక్షంలోకి తమ తొలి పూర్తిస్థాయి శాటిలైట్ మిషన్‌ను పంపాలని స్కైరూట్ ప్రయత్నిస్తున్నది. దీంతో భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి పునాదులు పడ్డట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, టీమ్‌సెక్, జీఐసీ వంటి ఇన్వెస్టర్లు ఈ ప్రాజెక్టు వెనుక ఉన్నారు. అయితే వచ్చే ఏడాది ప్రతీ 3 నెలలకోసారి ఒక ప్రయోగాన్ని చేపట్టాలని స్కైరూట్ యోచిస్తున్నది. ఈ క్రమంలోనే 2027కల్లా నెలకోసారి జరుపాలనుకుంటున్నామని చెప్తున్నది.

9 నెలలు.. 3 మిలియన్ డాలర్లు: ఒక్కో రాకెట్ నిర్మాణానికి దాదాపు 8-9 నెలల సమయం పడుతుందని, 2-3 మిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని స్కైరూట్ సీఈవో పవన్ చందన చెప్తున్నారు. దేశ, విదేశీ కస్టమర్ల పేలోడ్స్‌తో ఒక్కో ప్రయోగం ద్వారా సుమారు 5 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అందుకోవచ్చనీ అంటున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చిన్నపాటి శాటిలైట్ల ప్రయోగాలకు డిమాండ్ పెరుగుతున్నదంటున్న స్కైరూట్.. తమ ప్రయోగాలతో ము న్ముందు భారత, అంతర్జాతీయ క్లయింట్లకు మరింత చౌకగా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చుతున్నది. 2018లో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను స్థాపించారు.

ఫండింగ్‌లో భాగంగా రూ.850 కోట్ల నిధులను ఈ కంపెనీ సమీకరించింది. 2022 నవంబర్‌లో తమ సబ్‌ఆర్బిటల్ వెహికిల్ విక్రమ్-ఎస్‌ను పరీక్షించడం ద్వారా ఓ రాకెట్‌ను లాంచ్ చేసిన తొలి ప్రైవేట్ భారతీయ సంస్థగా స్కైరూట్ గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఇంజినీరింగ్, సరఫరాపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ సంస్థ.. 2028 మార్చి నాటికి లాభాల్లోకి అడుగుపెడుతామన్న ధీమాను కనబరుస్తున్నది. భారతీయ ప్రైవేట్ స్పేస్ ఇండస్ట్రీలో 200కుపైగా స్టార్టప్‌లు. 2033కల్లా ఈ రంగం విలువ 44 బిలియన్ డాలర్లకు చేరగలదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ అంచనా వేస్తున్నది.

# నేడు ఎన్‌ఎఫ్ సి, డిఎఈ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆవిరావే సభ



**ఏఎస్ రావునగర్, జనవరి 02, (తెలంగాణ దిశ)** :అణు ఇంధన సంస్థ (ఎన్‌ఎఫ్ సి), డిపార్ట్ మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డిఎఈ) విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్‌ఆవిర్భావ సభ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఈసీఐఎల్ చౌరస్తాలోని డాక్టర్ హెూమీ జే బాబా కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేయడం జరిగిందని అసోసియేషన్ నాయకులు కొత్త అంజిరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. అణు ఇంధన సంస్థ (ఎన్‌ఎఫ్ సి), డిపార్ట్ మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డిఎఈ) విశ్రాంత ఉద్యోగులందరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

# నూతన సంవత్సరం అందరికీ కలిసి రావాలి : టీటీడీపీ



**ఏఎస్ రావునగర్, జనవరి 02, (తెలంగాణ దిశ)** :నూతన సంవత్సరం అందరికీ కలిసి రావాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ జిల్లా కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. నూతన సంవత్సరం 2026 సందరరేగా శుక్రవారం స్థానిక టీటీడీపీ నేతలు, పార్టీ జిల్లా కన్వీనర్ అశోక్ కుమార్ గౌడ్ నివాసానికి వెళ్లి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరూ సంపూర? ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు, మాజీ కౌన్సిలర్ గడ్డమీది రాములు యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు టిక్కా ప్రకాష్, సీనియర్ నేతలు గొట్టిపాటి వెంకటేశ్వరావు గోబేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో కొత్త పొత్తులు

విజయవాడ, : ఏపీలో కమ్యూనిస్టులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కడతారా? అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? రెండువైపుల నుంచి చర్చలు మొదలయ్యాయా? రెండు వైపులా ఇది ఆవశ్యమా? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎన్డీఏలో తెలుగుదేశంతో పాటు జనసేన భాగస్వామ్య పక్షాలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి ఉంది. వైసిపి ఒంటరి పోరాటం చేస్తోంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమి లో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో తటస్థ వైఖరి అనుసరిస్తోంది. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి బిజెపి విషయంలో సానుకూలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరాటం కంటే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడమే మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం జగన్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన అసలు పేరు మధుసూదన్ రెడ్డి గా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి బంధువు అవుతారని కూడా ప్రచారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్న సమయంలో మధు అనారోగ్యానికి గురైతే పరామర్శించారు. అటు తరువాత సిపిఎం అనుబంధ పత్రికకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారీగా ప్రకటనలు కూడా వచ్చాయి. దీంతో గత పదేళ్లుగా జగన్ విషయంలో సిపిఎం పెద్దగా సౌండ్ చేయలేదు.

# అమెరికాలో నో కింగ్స్ ఉద్యమం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2.0 పాలనపై ఏడాది తిరగకుండానే అమెరికాన్లు తిరుగుబాటు షురూ చేశారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. మొదటి రోజు నుంచే సంచలన నిర్ణయాలు. అడ్మినిస్ట్రేటివ్ ఆర్డర్లు జారీ చేస్తూ అందరిలో భయం సృష్టించారు. రోజురోజుకూ తన పరిధిని మించి నిర్ణయాలతో ఇటు అమెరికన్లు.. అటు ప్రపంచ దేశాలు నిత్యం భయప డుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వ్యతిరేక శక్తులు పెరుగుతున్నా యి. తన నిర్ణయమే ఫైనల్ అన్నట్లు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఇదే తరుణంలో ట్రంప్ వేధింపులతో విసిగిపోయిన అమెరికన్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉద్యమం మొదలు పెట్టారు. అక్టోబర్ 18న అమెరికా అంతటా, అలాగే మిత్ర దేశాల్లోనూ 'నో కింగ్స్' పేరుతో భారీ నిరసనలు జరిగాయి. ఇది కేవలం రాజకీయ కార్యక్రమం కాదు.. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఉద్యమంగా నిరసనకారులు పేర్కొంటున్నారు. దాదాపు 2,700 నగరాల్లో ఆందోళనలు జరగడం అమెరికా అధ్యక్షుడిపై వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఇందులో సుమారు 70 లక్షల మందికి పైగా పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి ప్రేరణ.. 2016లో ప్రారంభమైన 'ఇండివైజబుల్' అనే సంస్థ నుండి వచ్చింది, ఇది మొదట ట్రంప్ అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడింది. ఇప్పుడు, వేలాది సంస్థలు కలిసి ఈ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తున్నాయి. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్, టీచర్స్ ఫెడరేషన్, మూవ్ ఆన్ వంటి సంస్థలు ఇందుకు తోడ్పడుతున్నాయి. తాజాగా ఉద్యమకారులు.. ఒక కొత్త సూత్రాన్ని ప్రవేశపెట్టారు. దేశంలో కనీసం 3.5 శాతం ప్రజలు స్థిరంగా వీధుల్లోకి దిగితే ప్రభుత్వం మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇది ఎరికా చెనోవెత్, మారియా స్టీఫెన్ వంటి రాజకీయ శాస్త్రవేత్తల పరిశోధన ఆధారంగా రూపొందించారు. ఈ సిద్ధాంతం ఉద్యమానికి శాస్త్రీయ చట్టబద్ధతను ఇచ్చినా, దానికీ పరిమితులు ఉన్నట్టు నిపుణులు కూడా సూచిస్తున్నారు. ప్రజలు, స్వతంత్ర సంస్థలు ట్రంప్‌పై అనేక ఆరోపణలు చేస్తున్నారు. పాలనా తీరుపై అభ్యంతరాలు చెబుతున్నారు. వలసదారుల నిర్బంధం, బహిష్క రణను వ్యతిరేకిస్తున్నారు. రాజ్యాంగ సంస్థలపై ఆధిపత్యం చెలాయిం చడాన్ని నిరసిస్తున్నారు. నేషనల్ గార్డ్స్‌ను నగరాలకు నియమించడాన్ని తప్పు పడుతున్నారు. ప్రజా ధనాన్ని తన సొంత అవసరాలకు వాడుకో వడంపై మండిపడుతున్నారు. కోర్టుల తీర్పులను లెక్కచేయకపో వడంపైనా జనాగ్రహం పెల్లుబిగుస్తోంది. పెట్టుబడిదారుల అనుకూల ఆర్థిక విధానాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉన్నట్లు అమెరికన్లు భావిస్తున్నారు. ఈ చర్యల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలవ డంతోపాటు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వినియోగదారులపై విపరీమైన భారం పడుతోంఇక నిరసనలపై ట్రంప్ స్పందిస్తూ.. 'వాళ్లు నన్ను రాజు అంటున్నారు, కానీ నేను కాను' అని ట్రంప్ వ్యాఖ్యానించినప్పటికీ, ఆయన స్వయంగా షేర్ చేసిన ఏఐ వీడియో ప్రపంచవ్యాప్తంగా విమర్శలకు దారితీసింది. ఆ వీడియోలో ఆయనను రాజుగా చూపిస్తూ నిరసనకారులపై దూషణ చేయడంపై జనం మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈవీడియో ద్వారా అధ్యక్షుడి భాషను కాకుండా, అహంకారంగా ప్రజలు భావిస్తున్నారు.ట్రంప్ పెట్టిన ప్రారంభ హెచ్చరిక రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై సైకాలజికల్ ప్రెజర్ సృష్టించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్‌కు అత్యాధునిక దాడి సామర్థ్యమున్న క్షిపణులు అందిస్తామని చెప్పడం ద్వారా అమెరికా మళ్లీ విధేయత చూపించే ప్రయత్నం చేసింది. అయితే ఆ ప్రకటన తర్వాత మాస్కో నుంచి తీవ్రమైన హెచ్చరికలు వచ్చాయి. "ఉక్రెయిన్కు క్షిపణులు ఇస్తే, రష్యా?అమెరికా సంబంధాలకు తిరిగిపోని నష్టం జరుగుతుంది" అని పుతిన్ స్పష్టంగా వార్నింగ్ ఇచ్చాడు. దెబ్బకు ట్రంప్ వెనక్కు తగ్గారు. ఓవల్ ఆఫీసులో ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ?కతో సమావేశమైతో మహాక్ క్షిపణుల అంశంపై మాట్లాడారు. జెలెన్స్కీ?క, "అవి లభిస్తే పుతిన్ శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకుంటాడు" అని అభిప్రాయపడ్డారని అమెరికా మీడియా పేర్కొంది. కానీ ట్రంప్ మాత్రం "ప్రస్తుత సమయంలో అమెరికా నిల్వలను తగ్గించలేను. నా ప్రాధాన్యం యుద్ధాన్ని ముగించడం" అని స్పష్టంగా చెప్పారని సమాచారం. ఈ అభిప్రాయం ఆయన కొత్త విధానంగా భావిస్తున్నారు. పుతిన్‌తో జరిగిన ఇటీవల భేటీ కూడా ఈ మార్పుకు కారణమని వాస్తవాలు సూచిస్తున్నాయి. ట్రంప్, రష్యా సహకారం లేకుండా ఉక్రెయిన్ శాంతి సాధ్యం కాదనే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే ఆయుధాలు పంపడంపై కాకుండా శాంతి చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

దీని వెనుక మరో అంశం కూడా ఉంది. అమెరికా అంతర్గత రాజకీయ ఒత్తిడి. కాంగ్రెస్‌లో కొందరు సెనేటర్లు యుక్రెయిన్‌కు ఆయుధాలు పంపడాన్ని వ్యతిరేకిస్తున్నారు. టంప్ పదే పదే మాట మార్చుతున్నారని విమర్శలు వస్తున్నా, ఆయనకు ఇది ఒక ప్రతిస్పందనాత్మక దౌత్యతంత్రం కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. హెచ్చరికల ద్వారా రష్యాను భయపెట్టే ప్రయత్నం చేస్తూ, చివర్లో వెనక్కు తగ్గడం ద్వారా శాంతి ఆదిపత్యం చూపే వ్యూహం అవుతుందేమో అన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే ఈ యూటర్న్ ఆయన విశ్వసనీయతకు దెబ్బతీస్తోంది. ప్రపంచ నేతగా సామరస్యానికి బదులు అయోమయం సృష్టిస్తున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి.

# వర్క్ పర్మిట్ ఆటోమేటిక్ పొడిగింపు రద్దు : అమెరికా




వాషింగ్టన్ : హెచ్1బి వీసా ఫీజును భారీగా పెంచిన కొన్ని వారాల్లోనే.. అమెరికా విదేశీ వలసదారులపై మరో కఠినమైన నిర్ణయం తీసుకుంది. విదేశీయులకు అవసరమైన ఉపాధి అధికార పత్రాలు- వర్క్ పర్మిట్లు (ఇఎడి) ఆటోమేటిక్ పొడిగింపును రద్దు చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇది పెద్ద సంఖ్యలో ఉన్న భారతీయ వలసదారులు మరియు కార్మికులపై తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. వలసలను అరికట్టే తాజా ప్రయత్నాలలో భాగంగా ..వారి ఉపాధి అధికారాలు లేదా వర్క్ పర్మిట్లు అనుమతుల చెల్లుబాటును పొడిగించే ముందు "ఏలియన్స్ (విదేశీయులు) సరిగా పరీక్షించడం మరియు తనిఖీ చేయడం" ప్రాధాన్యతగా తీసుకున్నట్లు యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీస్ (డిహెచ్ఎస్) బుధవారం ప్రకటన విడుదల చేసింది. తాజా నిబంధనల ప్రకారం.. 2025అ తర్వాత తమ ఇఎడిని పునరుద్ధరించడానికి దాఖలు చేసే విదేశీయులకు ఇకపై ఆటోమేటిక్ పొడిగింపు లభించదని డిహెచ్ఎస్ ఆప్రకటనలో తెలిపింది. ఒక ఏలియన్ ఉద్యోగ అధికారం లేదా డాక్యుమెంటేషన్ పొడిగించబడే ముందు తగిన పరిశీలన మరియు స్క్రీనింగ్ పూర్తయిందని నిర్ధారించుకోవడం సాధారణ చర్య. అయితే అమెరికాలో పనిచేయడం అనేది ఒక హక్కుకాదు, ఒక అవకాశం అని ఏలియన్స్ గుర్తుంచుకోవాలని యుఎస్‌సిఐఎస్ డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో తెలిపారు. దీంతో అమెరికాలో పనిచేయడానికి ఉపాధి అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే విదేశీయులను తరచుగా తనిఖీ చేయాల్సి వుంటుంది. ఈ నిర్ణయంతో హెచ్1బి, ఎల్, ఇ వీసాదారుల భాగస్వామ్యులు, శరణార్థి లేదా శరణార్థి హెూదా కలిగిన విదేశీయులపై తీవ్ర ప్రభావం పడనుంది. తాజా నిబంధనల ప్రకారం.. వర్క్‌పర్మిట్ల గడువు ముగియడానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తులు సమర్పించాలని డిహెచ్ఎస్ విదేశీయు లకు సూచించింది.

ఆ తర్వాత నుంచి వర్క్ పర్మిట్లను పునరుద్ధరించేందుకు దరఖాస్తు చేసుకునే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ ఉండదని తెలిపింది. అయితే ఈ తేదీ కంటే ముందు వర్క్ పర్మిట్లను పొండిగించుకున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదని డిహెచ్ఎస్ ప్రకటించింది. బైడెన్ ప్రభుత్వ హయాంలోపాత నిబంధనల ప్రకారం వర్క్ పర్మిట్లను పునరుద్ధరించడానికి సకాలంలో ఫారమ్ 1-765ని దాఖలు చేసే విదేశీయులు 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపును పొందేవారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు వాచ్1బి వీసాల ఫీజును పెంచుతూ ఒక ప్రకటనపై సంతకం చేసిన సంగతి తెలిసిందే. అమెరికా సెన్సస్ డేటా ప్రకారం.. 2022 నాటికి అమెరికాలో సుమారు 4.8మిలియన్ల (48 లక్షల మంది) భారతీయ అమెరికన్లు నివసిస్తున్నారు. ఇందులో 66శాతం మంది భారతీయ అమెరికన్లు వలసదారులు కాగా, 34 శాతం మంది అమెరికాలో జన్మించిన వారు.

# ఏపీలో ఆల్ ఇన్ వన్ యాప్

**ఒంగోలు,తెలంగాణ దిశ :** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా బిల్లు చెల్లింపులు, కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవడం సులభం కానుంది. అంతేకాకుండా.. ఇంట్లో ఉండే ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఎంత కరెంటు ఉపయోగి స్తున్నాయో ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులతో నేరుగా సంప్రదించే అవకాశం ఈ యాప్ ద్వారా కల్పించారు. కాగా ఇటీవల, విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ అధికారులను హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త సాంకేతికతను ఉపయోగిస్తోంది. వినియోగదారుల సమస్యలను మరింత వేగంగా, సమర్థంగా పరిష్కరించడానికి ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో ప్రత్యేక ఫీచర్లు అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో.. ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలిస్తారు. అనంతరం వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తారు యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు సులభంగా చెల్లించొచ్చు. బిల్‌పే అనే ఆప్షన్ ద్వారా సర్వీసు నంబరు, మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే.. వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు ప్రత్యక్షమవుతాయి. అనంతరం పేమెంట్ చేయాల్సి ఉంటుంది. ఇక కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం అప్లికేషన్ కూడా చేసుకోవచ్చు.

అందుకోసం అన్ని వివరాలను యాప్‌లో పొందుప రచాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును అధికారులు పరిశీలించి కొత్త కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు. కాగా, ఇంట్లో ఏయే ఎలక్ట్రానిక్ పరికరాలు ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నాయో.. ఈ యాప్‌లో ఉన్న ఎనర్జీ కాలిక్యులేటర్ ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు మీటరు రీడింగ్ వివరాలు ఎంటర్ చేస్తే.. ఆ సమాచారం కనిపిస్తుంది. అంతేకాకుండా, కరెంట్ ఆదా చేయడానికి కూడా ఈ యాప్‌లో సలహాలు, సూచనలు ఉంటాయి.

విద్యుత్ అధికారుతో కూడా నేరుగా మాట్లాడి సమస్యలు తెలిపే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది. సూపర్ యాప్ ద్వారా కస్టమర్ సేవలు కూడా అందిస్తోంది ఏపీఎస్పీడీసీఎల్. వినియోగదారులు తమ సమస్యలనుఈ యాప్‌లో పొందుపరచొచ్చు. విద్యుత్తు శాఖ అందిస్తున్న సేవలపై ఫీడ్‌బ్యాక్ కూడా ఇవ్వొచ్చు. సంతృప్తి లేదా అసంతృప్తి తెలియజే యొచ్చు. వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు ఈయాప్‌లో ఉంటాయి. వారికి ఫోన్ చేసి సందేహాలు అడిగి తెలుసుకోవచ్చు. అంతేకాకుండా వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు కూడా యాప్‌లో ఉంటాయి. విద్యుత్ వినియోగదా రులకు మెరుగైన, సత్వర సేవలను అందించాలని ఇటీవల ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అక్టోబర్ 22న ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 9 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో నిర్వహించారు. వినియోగదారుల మన్ననలు పొందేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సంస్థ పరిధిలోని 410 సెక్షన్లలో వినియోగదారులకు అందుబాటులో ఉంటూ నిరంతర విద్యుత్ సరఫరాలో ఓల్టేజ్ సమస్య లేకుండా చేయడానికి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని శివ శంకర్ వార్నింగ్ ఇచ్చారు.

# గరం...గరంగా పాలకుర్తి పాలిటిక్స్

**వరంగల్,తెలంగాణ దిశ:** ఎర్రబెల్లిని ఓడించి యశస్వినీరెడ్డికి పట్టం కట్టినపాలకుర్తి. పాలకుర్తి నియోజకవర్గంలో పాలిటిక్స్ గరం గరంగా నడు స్తున్నాయి. అధికార? ప్రతిపక్ష పార్టీల మధ్య జరగాల్సిన పోటాపోటీ రాజకీయాలు స్వంత పార్టీలోనే జరుగుతున్నాయి. అధికార హస్తం పార్టీ నేతలు రెండుగా చీలిపోయి ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుం టున్నారట. దీంతో నియోజకవర్గ అభివృద్ధి మాట పట్టించుకునేవారు లేరని స్థానికులు అసంతృప్తికి లోనవుతున్నారట. ఎర్రబెల్లిని ఓడించి యశస్వినీరెడ్డికి పట్టం కట్టిన పాలకుర్తి ప్రజలు సంక్షేమం, అభివృద్ధి లో నియోజకవర్గం దూసుకుపోతుందని భావించారట. ఝాన్సీ రెడ్డి, యశస్వినీ రెడ్డిలు రాజకీయాలకు కొత్త కావడంతో?. పార్టీలను పక్కనబెట్టి డెవలప్మెంట్ పైనే దృష్టి పెడతారని ఆశపడ్డారట. అయితే ఇప్పుడు తమ పరిస్తితి పెనం నుండి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన చెందుతున్నారట. సొంత నిధులు ఖర్చు పెట్టైనా అభివృద్ధి చేస్తామని హామీలు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఆమెఅత్త ఝాన్సీ రెడ్డి నియోజకవర్గాన్ని మోడల్ గా నిలుపుతా మని ప్రజలకు ప్రామిస్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనులను సొంత నిధులు ఖర్చు పెట్టైనా పూర్తి చేస్తామని హామీల వర్షంగుప్పించారు. కానీ నెలల గడుస్తున్న కొద్దీమాటలు తప్ప, అ భివృద్ధి బాటలు కనిపించట్లేదట. నియోజకవర్గంలో అభివృద్ధి జర గట్లేదని స్వంత పార్టీ నేతలే తమ ఎమ్మెల్యేపై మండిపడుతున్నారట. కొం తమంది నేతలు ధైర్యం చేసి ప్రజలకిచ్చిన హామీల మాటేమి టని అడిగితేపార్టీ నుండి వెలివేసి..మాతో పెట్టుకుంటే నిప్పుతో పెట్టుకున్నట్లే అంటూ సినిమా డైలాగులు చెప్తున్నారట. గోదాంల నిర్మాణాలపై కాంగ్రెస్ నాయుకుడు ఫైర్. ప్రస్తుతం దేవరుప్పుల మండలంలో 5కోట్ల రూపాయల నిధులతో గోదాంల నిర్మాణానికి ప్రభుత్వంసంకల్పించింది. అయితే ప్రభుత్వ స్థలంలో అందరికీ అందుబాటులో ఉండే చోట నిర్మాణాలు చేయాలని సొంత పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. దేవరుప్పుల శివారులోని మనుపాడ్ గుట్టలను తొలగించి గోదాంల నిర్మాణం చేయాలని కొందరు నే తలుసూచిస్తున్నారు. అయితే పర్యావరణానికి హానిరిగేలా? గుట్టలను తొలగిస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ నాయకుడు పెద్ది కృష్ణమూర్తి ఫైర్అయ్యారు. దీంతో ఆగ్రహానికి లోనైన ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి మరో సినిమా డైలాగ్ అందుకున్నారట. గ్రామస్తుల నిర్ణయం చెప్తే?ఈ డైలాగులు ఏంటని కాంగ్రెస్ శ్రేణులే విస్తుపో యారట. ప్రజల సంక్షేమం కోసం మాట్లాడితే వార్నింగ్ ఇస్తున్న అత్త ఝాన్సీ. గత కొద్ది నెలలుగా నియోజకవర్గ వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని నిరసనలు జరుగుతున్నాయి. ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్రూంలు పంపిణీ చేయాలని కొంతమంది హస్తం పార్టీ నేతలే పట్టుబడుతున్నారట. ఇలాప్రజల సంక్షేమం కోసం ఆలోచించి మాట్లాడితే?.తమతో పెట్టుకుంటే నిప్పుతో పెట్టుకున్నట్లే అంటూ తమ చుట్టూ ఉన్న నేతలకే వార్నింగ్స్ ఇస్తున్నారట ఎమ్మెల్యే అత్త ఝాన్సీ రెడ్డి.

అభివృద్ధిని పట్టించుకోవడం లేదని స్థానికుల అసం తృప్తి. నియోజకవర్గంలోని గ్రామాలలో రోడ్ల పరిస్తితి అధ్వాన్నంగా మారి,ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఇక ఖమ్మం హైవే ప్రతిరోజూ ప్రమాదాలతో రక్తసిక్తంగా మారుతోంది. సమస్యలు చెప్పు కుంటే మళ్ళీ సినిమా డైలాగులు చెప్తారేమోనని సైలెంట్ గా బాధలు అనుభవిస్తున్నారట నియోజకవర్గ ప్రజలు. ఎర్రబెల్లిని ఓడిస్తే? అభివృ ద్ధి సంక్షేమం దేవుడెరుగు సమస్యలు చెప్పుకుంటే రీసౌండ్ లో డైలాగులువినాల్సి వస్తుందని లోలోపలేమదన పడుతున్నారట పాలకుర్తి ప్రజలు. అభివృద్ధిలో దూసుకెళ్తామనుకున్న ఆశలన్నీ అడియాసలైనట్లేనని తలలు పట్టుకుంటున్నారట నాయకులు.

# వందేభారత్ స్లీపర్ రెడీ...




చెన్నై: భారతదేశంలో మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలు ప్రారంభానికి సిద్ధమవుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం భారత రైల్వే ఈ స్లీపర్ ట్రైన్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దింది. దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులకు విలాసవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించేలా విమానాల స్ఫూర్తితో కూడిన ఇంటీరియ ర్‌లు, ఆధునిక సౌకర్యాలు, మెరుగైన భద్రతా వ్యవస్థలతో ప్రీమియం అనుభవాన్ని అందిచేలా క్యాబిన్‌ను డిజైన్ చేసింది. అయితే వందేభారత్ స్లీపర్ కోచ్‌లోని ఫస్ట్‌క్లాస్ క్యాబిన్‌కు సంబంధించిన నమూనా వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నమూనా వీడియోలో ఫస్ట్-క్లాస్ స్లీపర్ క్యాబిన్‌లు, ఎర్గోనామిక్ సీటింగ్, ఆటోమేటిక్ డోర్లు, రీడింగ్ లైట్లు, వై-ఫై కనెక్టి విటీ, ఛార్జింగ్ పాయింట్లు, డిజిటల్ డిస్‌ప్లే ప్యానెల్‌లు, సెన్సార్ ఆధారిత లైటింగ్ ఉన్నాయి. ఇవి నెటిజన్లను ఎంతగానో అకర్షించాయి.

ఇది చూడ్డానికి చాలా ప్రీమియంగా కనిపిస్తున్నాయి. చాలా మంది నెటిజన్లు ఈ డిజైన్‌ను ప్రశంసిస్తూ, భారతదేశ ఇంజనీరింగ్ పురోగతిపై గర్వం వ్యక్తం చేశారు. మరికొందరు మాత్రం ప్రజా రవాణాలో అలాంటి లగ్జరీని క్యాబిన్‌లను ఏర్పాటు చేస్తే.. జనాలు వాటిని నాశనం చేస్తారని చెప్పుకొచ్చారు. మరికొ ందరు ఈ ప్రీమియం సేవలను పొందే అర్హతను నిర్ణయించడానికి క్రెడిట్ స్కోర్ మాదిరిగానే "పౌర స్కోర్" వ్యవస్థను ప్రవేశపెట్టాలని కామెంట్ చేశారు.

ఇదిలా ఉండగా భారతదేశపు మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ ట్రైన్‌లో ప్రయాణించేందుకు చాలా మంది ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని మరో వ్యక్తి కామెంట్ చేశారు. ఇక దేశంలో మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ ఢిల్లీ-పాట్నా మార్గంలో నడవనున్నట్లు తెలుస్తోంది. ఈ ట్రైన్ గంటకు 160 కి.మీ వేగంతో నడుస్తుంది. ఈ మొట్టమొదటి వందేభారత్ స్లీపర్ ట్రైన్ 16-కోచ్‌ల కాన్ఫిగరేషన్‌ను కలిగి ఉంటుంది, ఇందులోపదకొండు ఎసి 3-టైర్ కోచ్‌లు, నాలుగు ఎసి 2-టైర్ కోచ్‌లు,ఒక ఎసి ఫస్ట్ క్లాస్ కోచ్ ఉంటాయి, 823 స్లీపర్ బెర్త్‌లతో దాదాపు 1,128 మంది ప్రయాణికులకు వసతి కల్పిస్తుంది.

# పొగాకు వద్దంటే వినరే..



**గుంటూరు,తెలంగాణ దిశ :**ప్రభుత్వం వద్దన్నా రైతులు బర్లీ పొగాకు సాగునుఆపడం లేదు. ఖరీఫ్ లో 21 వేల ఎకరాల్లో సాగు చేయగా, అందులో 15 వేల ఎకరాలు బర్లీ పొగాకే. కొనుగోలుదారుల స్పష్టత లేక, ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టినా, సమస్య తీరడం లేదు. రబీలోనూ సాగు పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం వద్దని చెప్పినా రైతులు వినడం లేదు.. నిషేధించినా సరే వెనక్కు తగ్గడం లేదు. రాష్ట్రంలో రైతులు బర్లీ పొగాకు సాగు ఆగడం లేదు. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 21వేల ఎకరాల్లో రైతులు ఈ బర్లీ పొగాకు వేశారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 11,400 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 4,600 ఎకరాల్లో, కర్నూలు జిల్లాలో 4,000 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. మొత్తం 21 వేల ఎకరాల్లో, 15 వేల ఎకరాలు బర్లీ పొగాకే. ఎఫ్‌సీవీ (ఫుల్ క్యూర్డ్ వర్జీనియా పొగాకు) రకం కేవలం 6 వేల ఎకరాల్లోనే సాగైంది.. ఏడు జిల్లాల్లో కొద్ది విస్తీర్ణంలో సాగు చేశారు. మొత్తం 21 వేల ఎకరాల్లో.. 6 వేల ఎకరాలు ఫుల్ క్యూర్డ్ వర్జీనియా పొగాకు (ఎఫ్‌సీవీ) రకం కాగా.. మిగిలిన 15 వేల ఎకరాలు బర్లీ పొగాకు. ఈ పొగాకును ఎవరు కొనుగోలు చేస్తారు..


ఎంత ధరకు కొనుగోలు చేస్తారో కూడా క్లారిటీ లేదు. చాలామంది రైతులు మరే పంట వేయాలో తెలియక చాలామంది పొగాకు సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే.. రబీ సీజన్‌లో కూడా బర్లీ పొగాకు సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. అప్పుడు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గతేడాది క్వింటాలుకు రూ.15 వేలు పలికిన బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు ధరలు ఈ ఏడాది గణనీయంగా పడిపోయాయి. వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం, వారిని ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. మార్క్‌ఫెడ్ ద్వారా 19.73 మిలియన్ కిలోల బ్లాక్ బర్లీని కొనుగోలు చేసింది. క్వింటాలుకు రూ.12 వేలు ధర నిర్ణయించినా, చాలా మంది రైతులకు ఆ ధర కూడా దక్కలేదు. కొనుగోలు ప్రక్రియలో ధరలో కోత పడిందని రైతులు చెబుతున్నారు. ప్రైవేట్ వ్యాపారుల ద్వారా మరో 50 మిలియన్ (5 కోట్ల) కిలోల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అయినప్పటికీ, ఇంకా చాలా మంది రైతుల ఇళ్లలో పొగాకు అమ్ముడుపోకుండానే మిగిలిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైట్ బర్లీ సాగు చేసిన రైతులు కూడా ఈ ఏడాది నష్టాలనే ఎదుర్కొన్నారు. గత ఏడాది క్వింటాలుకు రూ.15 వేలు లభించిన ధర, ఈ ఏడాది రూ.12 వేల నుంచి అతికష్టం మీద మాత్రమే రూ.15 వేలకు చేరింది. అంటే ధరలో పెద్దగా పెరుగుదల లేదని, కొందరు రైతులు రూ.12 వేలకే అమ్ముకోవాల్సి వచ్చిందని చెబుతు న్నారు. కర్నూలు, నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వైట్ బర్లీ పొగాకు సాగు ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలలోని రైతులు ఈ ధరల పతనంతో తీవ్రంగా నష్టపోయారు.

వ్యాపారులు ముందుకు రాకపోవ డం, ప్రభుత్వ కొనుగోళ్లు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఏపీ ప్రభుత్వం హెచ్‌డీ బీఆర్జీ, హెచ్‌డీ బర్లీ, బ్లాక్ బర్లీ వంటి పొగాకు రకాల సాగును నియంత్రించింది. ఈ నియంత్రణలో భాగంగా, జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్‌ల నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశారు.

# చెవి నొప్పి తగ్గేందుకు సహజసిద్ధమైన ఇంటి చిట్కాలు..

## వీటిని పాటించండి చాలు..!



చెవి ఇన్‌ఫెక్షన్ లేదా చెవిలో నొప్పి, ఇతర చెవి సమస్యలు సాధారణంగా చాలా మందికి తరచూ వస్తూనే ఉంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ఉన్నవారిలో, ఆహారపు అలర్జీలు ఉన్నా, పోషకాల లోపం,చెవి లోపల అంతర్గత గాయాలు అయినప్పుడు, వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నప్పుడు సహజంగానే కొందరికి చెవి సమస్యలు వస్తాయి. కొందరికి చెవుల్లో నుంచి ద్రవం బయటకు వచ్చి నొప్పిఇంకా ఎక్కువగా ఉంటుంది. దీంతో తీవ్రమైన ఇబ్బందిగా అనిపిస్తుంది. కొందరికి కేవలం ఒక చెవిలోనే ఈ సమస్యలు వస్తాయి, మరికొందరికి రెండు చెవుల్లోనూ ఇలా అవుతుంది. చిన్నారుల్లో చెవి సమస్యలు తరచూ వస్తుంటాయి. అయితే ఈ సమస్య ఎవరికి వచ్చినా సరే అందుకు కొన్ని ఇంటి చిట్కాలు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిని పాటించడం వల్ల అన్ని రకాల చెవి సమస్యల నుంచి బయట పడవచ్చు. చెవి నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఉప్పు,వెల్లుల్లి..: చెవి ఇన్‌ఫెక్షన్, చెవి నొప్పిని తగ్గించేందుకు ఉప్పు బాగా పనిచేస్తుంది. కొద్దిగా ఉప్పును తీసుకుని పెనంపై వేడి చేసి దాన్ని వస్త్రంలో చుట్టి దాంతో నొప్పి ఉన్న చెవిపై 5 నుంచి 10 నిమిషాల పాటు కాపడం పెట్టాలి. ఇలా రోజుకు 2 నుంచి 3 సార్లు చేస్తుంటే చెవిలో ఉండే ద్రవం బయటకు వస్తుంది. నొప్పి, వాపు తగ్గిపోతాయి. ఇన్‌ఫెక్షన్ నుంచి బయట పడవచ్చు. ఇలా తగ్గే వరకు చేయవచ్చు. అలాగే చెవి సమస్యలను తగ్గించేందుకు వెల్లుల్లి కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. రెండు వెల్లుల్లి రెబ్బలు, రెండు లవంగాలను తీసుకొని ఒక టేబుల్ టీస్పూన్ నువ్వుల నూనెలో బాగా వేడి చేయాలి. అనంతరం ఆ నూనెను వడబోసి దాన్ని నొప్పిగా ఉన్న చెవిలో రెండు చుక్కల చొప్పున వేయాలి. దీని వల్ల తక్షణమే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా రోజుకు 2 సార్లు చేస్తుంటే చెవి ఇన్‌ఫెక్షన్ సైతం తగ్గిపోతుంది.

తులసి ఆకులు..: తులసి ఆకులకు ఆయుర్వేదంలో ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. వీటిల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఇవి ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. తులసి ఆకులను దంచి రసం తీసి దాన్ని చెవిలో రెండు చుక్కల చొప్పున వేయాలి. దీని వల్ల నొప్పి నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. అలాగే తులసి ఆకుల రసాన్ని కొబ్బరినూనెలో కలిపి ఆ మిశ్రమంలో కాటన్‌బాల్ ముంచి దాని సహాయంతో చెవి లోపల, చెవి అంచు చుట్టూ, చెవి వెనుక సున్నితంగా మర్దనా చేయాలి. ఇలా చేస్తుంటే చెవి ఇన్‌ఫెక్షన్ తగ్గిపోతుంది. అదేవిధంగా చెవి సమస్యలను తగ్గించేందుకు యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. ఒక భాగం ఆపిల్ సైడర్ వెనిగర్ ను సమానమైన నీరు లేదా ఆల్కహాల్ తో కలపాలి. ఈ ద్రావణంలో కాటన్ బాల్ వేసి ఆ కాటన్ బాల్ ను చెవిలో ఐదు నిమిషాలపాటు పెట్టడం వల్ల చెవి నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. దీంతోపాటు ఇన్‌ఫెక్షన్ కూడా తగ్గుతుంది. కొద్దిగా ఆలివ్ ఆయిల్ ను తక్కువ మంట మీద వేడి చేసి గోరువెచ్చగా ఉన్న నూనెను రెండు చుక్కల చొప్పున చెవులలో వేసుకోవటం వల్ల చెవి నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. ఆలివ్ ఆయిల్‌లో ఉండే యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలు నొప్పి, ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించడంలో సహాయం చేస్తాయి. అలాగే ఈ చిట్కాను పాటించడం వల్ల చెవి శుభ్రంగా మారుతుంది. ఇక మెడకు సంబంధించిన వ్యాయామాలను చేస్తున్నా కూడా చెవి నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే చల్లని లేదా వేడి ప్యాక్‌లను పెట్టుకోవడం వల్ల కూడా నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు.

# దండెం మీ వెంటే..!




వానాకాలమో చలికాలమో ఊళ్లకీ, ట్రిప్పులకీ వెళితే బట్టలు ఆరేయడం అన్నది పెద్ద సమస్యగా ఉంటుంది. రెండు మూడు రోజులైతే ఫర్వాలేదు కానీ అంతకు మించి ఉండాల్సి వస్తే చిన్నవో పెద్దవో దుస్తులు ఉతికి ఆరేసుకోక తప్పదు. కానీచాలా సార్లు అక్కడ వసతి ఉండదు. కొన్నిసార్లు వాతావరణం కారణంగా ఆరు బయట దుస్తులు ఆరే అవకాశం ఉండదు.

అలాంటప్పుడు ఏ చోటైనా కొద్దిగా వసతి ఉంటే చాలు చటుక్కున దుస్తులు ఆరేసుకుని, గబుక్కున తీసేసుకునేలాంటి అవకాశాన్ని కల్పిస్తాయి ఈ 'పోర్టబుల్ క్లాత్స్ లైన్'లు. అవేనండీ పోర్టబుల్ దండేలన్నమాట! వీటికి ఆ చివరా ఈ చివరా హుక్కుల్లాంటివి ఉంటాయి. మధ్యలో తాడుకి బట్టల క్లిప్పులు కూడా పెట్టి ఉంటాయి. ఆరేసిన దుస్తులు బరువు వల్లనో గాలి వల్లనో ఒకదాని మీద ఒకటి పడకుండా ఉండేందుకు మధ్యలో పూసల్లాంటి క్లిప్పులూ ఉంటాయి. గదిలో అవకాశం ఉన్న ఏదో ఓ మూల తాడు చివర ఉండే హుక్కుల్ని తగిలించుకుంటే చక్కగా బట్టలు ఆరేసుకోవచ్చు. కాస్త పొడిబారగానే దుస్తుల్నీ దండేన్నీ తీసేసి బ్యాగులో పెట్టేసుకోవచ్చు. ఆరుబయట ఆరేసుకోవాలన్నా ఇది ఉపయోగకరమే.

# కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన**

**- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వెలిచాల రాజేందర్ రావు**



**కరీంనగర్,తెలంగాణ దిశ :**కాంగ్రెస్ పార్టీకి కరీంనగర్ జిల్లా కంచకోట అనీ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కరీంనగర్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్కు కంచుకోట అని ముఖ్యమంత్రి తెలిపారు హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి స్వగృహంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చించారు. అన్ని అంశాలను ముఖ్యమంత్రి సావధానంగా విన్నారు. కరీంనగర్ ప్రజలు పార్టీ క్యాడర్తో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మమేకమవుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నానని రాజేందర్ రావు వివరించారు. అదేవిధంగా కరీంనగర్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసాయనీ నగరంలో దాదాపు అన్ని మండపాలం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించానని ముఖ్యమంత్రితో పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 30 కోట్ల ఉచిత విద్యుత్తును వినాయక మండపాలకు అందించడం రాష్ట్ర చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందని తెలిపారు. ఉచిత విద్యుత్ అంశం రాష్ట్ర ప్రభుత్వానికి మంచి మైలేజ్ ఇచ్చిందని ప్రజల్లోనూ మంచి గుర్తింపు వచ్చిందని వివరించారు. రాబోయే దసరా ఉత్సవాలను కూడా ప్రత్యేకంగా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా చర్యలు తీసుకుంటామని రాజేందర్ రావ్ పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజల కష్టసుఖాల్లో నిత్యం మమేకం అవుతున్నాననీ ప్రజల కూడా ఎంతో ఆత్మీయంగా పలకరిస్తూ అక్కున చేర్చుకుంటున్నారని, ప్రజల సహకారం కూడా మర్చిపోలేనని ముఖ్యమంత్రికి వివరించారు. ఒక ప్రణాళిక ప్రకారం స్థానిక సంస్థలు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు కష్టపడి పని చేస్తున్నామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్క కార్యకర్తను సన్నద్ధం చేస్తున్నామని వివరించారు. మీ యొక్క ఆశీర్వాదంతో కరీంనగర్లో ముందుకెళ్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని రాజేందర్ రావు ముఖ్యమంత్రితో చెప్పారు. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా పై ప్రత్యేకంగా పోస్టర్లు ముద్రించి ప్రజలకు అవగాహన కల్పించామనీ, ప్రజల నుంచి కూడా మంచి సానుకూల స్పందన వ్యక్తం అయిందని ముఖ్యమంత్రికి రాజేందర్ రావు వివరించారు. అన్ని విషయాలను సావధానంగా విన్న ముఖ్యమంత్రి రాజేందర్రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కరీంనగర్లో కష్టపడి పని చేయండి.. పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి..

అని వెన్నుతట్టి ముఖ్యమంత్రి చెప్పారు. కరీంనగర్ అభివృద్ధి లక్ష్యంగా తాను ముందుండి ప్రత్యేక దృష్టి పెడతానని పేద ప్రజల కు అండగా ఉంటానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కరీంనగర్లో గణేష్ నిమజ్జనం వేడుకలు ప్రశాంతంగా సాగాయని అధికారులు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అభినందనీయమని రాజేంద్ర రావు ఆనందం వ్యక్తం చేశారు. మంచి ప్రణాళిక తో ముందుకు వెళ్తున్న రాజేందర్రావుకు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇదేవిధంగా ముందుకెళ్తూ కరీంనగర్లో కాంగ్రెస్

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని రాజేందర్రావుకు ముఖ్యమంత్రి సూచించారు. కరీంనగర్ నగర అభివృద్ధిపై సైతం ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి కోరగా సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన సైతం మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కరీంనగర్ను తెలంగాణ రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామనీ, త్వరలోనే కరీంనగర్ కు వస్తానని రాజేందర్రావుతో ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# బిసి రిజర్వేషన్లపై ముందే చెప్పాం

**బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బిసి రిజర్వేషన్లపై లీగల్ సమస్యలు వస్తాయని ముందే చెప్పామని బిజెపి అధ్యక్షుడు రాంచందర్ తెలిపారు. బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. న్యాయ నిపుణుల ను ముందు సంప్రదించారా? అని రిజర్వేషన్ల విషయంలో బిజెపి ఎక్కడ అడ్డుపడింది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేయలేక తమపై నెపం వేయవద్దని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో బిజెపికి అధికారం ఇస్తే బిసిల 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ కు చిత్త శుద్ధి లేకుండా తమపై నిందలు వేస్తున్నారని రాంచందర్ ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకమని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరుతో ద్రోహం చేసిందని ఆరోపించారు. తెలంగాణ బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తుందని విమర్శించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కామారెడ్డి గడ్డ మీద మాట్లాడే అర్హత కాంగ్రెస్కు లేదన్నారు. పంచా యతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.3 వేల కోట్లు-ఆగిపోయాయని చెప్పారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు రాజ్నాథ్ సింగ్ వస్తున్నారని, అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

# అదికర్మయోగి అభియాన్ మిషన్ ను విజయవంతం చేయాలి

**భూపాలపల్లి,తెలంగాణ దిశ :** ఆది కర్మయోగి అభియాన్ మిషన్ ను గ్రామస్థాయిలో మూవ్ మెంట్ లాగా అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ మిషన్ పై మిషన్ భగీరథ, విద్య, వైద్య, డిఆర్డిఓ, గిరిజన సంక్షేమ, మహిళా సంక్షేమ, అటవీ తదితర శాఖల అధికారులతో డిస్ట్రిక్ ప్రాసెస్ ల్యాబ్ అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో కాటారం, పలిమెల, మహా ముత్తారం, మహాదేవపూర్ మండలాల్లోని 37 గిరిజన గ్రామాలను ఆదికర్మ యోగి అభియాన్ మిషన్ కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్రతిష్టాత్మకమైన సుపరిపాలనకు 17 శాఖల సమన్వయంతో ప్రతి పౌరునికి ప్రభుత్వ పథకాలు అందేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అవగాహన పొందిన సిబ్బంది గిరిజన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు చేపట్టబడిన ఈ పథకాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ విజయవంతం చేయాలని సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సుపరిపాలన, సేవల్లో పారదర్శకం గా ఉండాలన్న లక్ష్యంతో చేపట్టారని తెలిపారు. అర్హులకు సంక్షేమ పథకాలు అమలయ్యేలా పనిచేయటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యామని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, అన్ని శాఖల సిబ్బంది ఆదికర్మ యోగి మిషన్ పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, ఏదేని సమస్య వస్తే ఇది నా శాఖకు సంబంధించినది కాదన్న ధోరణిలో వ్యవహరించొద్దని ఆయన సూచించారు. ఏదైనా సమస్య ఒక శాఖ దృష్టికి వచ్చినట్లయితే ఆ శాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు.

# నీళ్లు పుష్కలం.. కాల్వ అధ్వానం..!



**ఎల్కతుర్తి,తెలంగాణ దిశ :**వృథాగా పోయే వాగు నీటిని గొలుసుకట్టు చెరువులకు మళ్లించాలన్న రైతుల సంకల్పం మూడు రోజుల ముచ్చటగానే మిగిలిపోయింది. బీఆర్ఎస్ హయాంలో కోట్లు వెచ్చించి నిర్మించిన మాటు కాల్వ (ఫీడర్ఛానెల్) ఒక్క భారీ వర్షానికే ఐదారు చోట్ల గండ్లు పడి, పూడికతో నిండిపోయింది. శాశ్వత నీటి కరువును తీరుస్తుందని భావించిన ఈ కాల్వ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనికిరాకుండా పోయింది. కాల్వను పునరుద్ధరిస్తే ఆరు చెరువుల కింద దాదాపు రెండు వేల ఎకరాల ఆయకట్టు రైతులకు లాభం కలిగే అవకాశం ఉంది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రం, హసన్‌పర్తి మండలం అన్నసాగర్ గ్రామాల సరిహద్దులో పెద్ద వాగు ప్రవహిస్తోంది.

ధర్మసాగర్ రిజర్వాయర్ మత్తడి నీరు, ఇనుపరాతి గుట్టల్లోని జాలు నుండి వచ్చే నీరు, పలు గొలుసుకట్టు చెరువుల మత్తడి నీళ్లు పెద్దవాగు గుండా ప్రవహించి కమలాపూర్ మండలం శనిగరం వాగులో, అటు నుండి మానేరు వాగులో కలుస్తాయి. ఏడాదిలో దాదాపు ఐదు నెలల పాటు ఈ వాగు ప్రవాహం కొనసాగుతుంది.

వాగుపై చెక్ డ్యాం..: వృథా నీటికి అడ్డుకట్ట కట్టి గొలుసుకట్టు చెరువులకు మళ్లించేందుకు 1985లో అప్పటి ఇంజినీర్లు అన్నసాగర్%-%ఎల్కతుర్తి శివారులో వాగుకు అడ్డుగా చెక్ డ్యాం (మాటు) నిర్మించి ఎల్కతుర్తి వైపు షటర్లు బిగించారు. అక్కడి నుండి కాలువ ద్వారా బోడికోని కుంట, మల్లన్నకుంటను కలుపుతూ ఎల్కతుర్తి ఊర చెరువు వరకు తవ్వారు. కానీ, గతంలో కురిసిన భారీ వర్షాలకు కాల్వ తెగిపోయింది. బీఆర్ఎస్ అధికారం లోకి వచ్చిన తరువాత మిషన్ కాకతీయలో భాగంగా కాల్వ పునరుద్ధరణకు నిధులు కేటాయించింది.

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం..: చెక్ డ్యాం నుండి ఎల్కతుర్తి ఊర చెరువు వరకు 2.4 కిలోమీటర్ల మేర కాలువ, మధ్యలో మూడు బ్రిడ్జిలు, రెండు చోట్ల షటర్లతో పాటు ఎల్కతుర్తి చెరువులో పూడికతీత, మత్తడి, తూము, బతుకమ్మ విగ్రహం, బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయడానికి రెండున్నర కోట్లు విడుదలయ్యాయి.

బీఆర్ఎస్ నేత బినామీ అయిన ఓ కాంట్రాక్టర్ ఈ పనులను చేపట్టాడు. మాటు నుండి ఉన్న కాల్వకు రెండు వైపులా కట్ట పోవాల్సి ఉన్నా, ఒకవైపు మట్టి పోసి, మరోవైపు వదిలేశాడు. వర్షాలు కురిసిన సమయంలో వచ్చిన వరద నీరు ఈ కాలువలోకి చేరి ఎక్కడికక్కడ కట్ట తెగిపోయింది. కాలువనిండా పూడిక చేరింది. కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయడంతో కాల్వ పనికిరాకుండా పోయింది. కాల్వలో తుమ్మ, తుంగ మొలిచి నీళ్లు వెళ్లలేని పరిస్థితి వచ్చింది.

చందాలు వేసుకొని..: గత ఏడాది వాగు నీటిని ఎల్కతుర్తి, చింతలపల్లి రైతులు పొలాలకు మళ్లించుకునేందుకు తలా కొంత చందాలు వేసుకున్నారు. వీరికి ఎల్కతుర్తి ముదిరాజ్‌లు తోడై సంఘం నుండి కొన్ని డబ్బులు వెచ్చించి జేసీబీ సాయంతో తాత్కాలిక మరమ్మతులు చేసి చెరువులు నింపారు. కాల్వకు మోటార్లు వేసి రైతులు పంటలు పండించుకున్నారు. కానీ, ప్రస్తుతం కాల్వ నిరుపయోగంగా మారి చెత్త, చెదారంతో నిండిపోయింది.

రెండు వేల ఎకరాలకు నీరు..: పెద్దవాగు గుండా మానేరులో కలిసే నీటిని చెక్ డ్యాం ద్వారా మళ్లిస్తే ఎల్కతుర్తి, సూరారం, దండేపల్లి గ్రామాలలో ఆరు గొలుసుకట్టు చెరువులు నిండే అవకాశం ఉంది. అలాగే ఎల్కతుర్తి, చింతలపల్లి గ్రామాలలో నీటి కరువు తీరుతుంది.

ఆయా గ్రామాల్లో భూగర్భజలాలకు కొదువ ఉండదు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి కాల్వను పునరుద్ధరించాలని, సీసీ లైనింగ్ వేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

# రాష్ట్రంలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్

**-ఆస్ట్రేలియా డికన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో ఏర్పాటు**

**-మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై సంతకాలు**



**మంథని,తెలంగాణ దిశ :**తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ 'డికన్ విశ్వవిద్యాలయం' ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ వోఐ)పై డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో డికన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా సంతకాలు చేశారు. అనంతరం ఈ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూఅంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ఏఐలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు డికన్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం. ఇది కేవలం లాంఛనప్రాయ ఒప్పందం కాదు. రాబోయే రోజుల్లో కీలక రంగాల్లో తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షి సంబంధాల మెరుగుదలకు దిక్సూచీగా మారుతుంది. సమాజానికి ఉపయోగపడే అత్యాధునిక ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశోధనలు, వ్యవస్థాపకతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది అని వివరించారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రంగాల్లో ప్రపంచానికి అత్యంత నైపుణ్యమున్న మానవ వనరులను తెలంగాణ నుంచే అందించాలని లక్ష్యంగాపెట్టుకుని, ఆదిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీ సంయుక్తంగా నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏఐ కోర్సులకు రూపకల్పన చేసి, ఇక్కడి యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణనిస్తాయి. మన ఏఐ స్టార్టప్ సంస్థలు అంతర్జాతీయ మార్కెట్ లో తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వ వ్యాప్తం చేసేలా ఆస్ట్రేలియా నిపుణులు మార్గదర్శకత్వం చేస్తారు అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఏఐ కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాకుండా, సమ్మిళిత వృద్ధికి, మానవాభివృద్ధికి ఒక శక్తివంతమైన సాధనంగా మార్చేలా మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తోంది. ఈ లక్ష్య సాధనలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ మార్గదర్శిగా మారుతుంది. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గవర్నెన్స్ తదితర రంగాల్లో ఏఐ వినియోగాన్ని పెంచి పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా సంయుక్త పరిశోధనలు నిర్వహిస్తాం. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను కనుగొనేందుకు కృషి చేస్తాం అని ఆయన తెలిపారు.

## అందుకే ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాం

**-డికన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్**

ఏఐలో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయం. ప్రజల శ్రేయస్సు కోసం సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన ఏఐ పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతోనే భారత్ లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. ఇందుకోసం తెలంగాణ అన్ని రకాలుగా అనుకూలంగా ఉందని గుర్తించాం. అందుకే ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చామని డికన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కాన్సుల్ జనరల్(ఆస్ట్రేలియన్ కాన్సులేట్- జనరల్ బెంగళూరు) స్టీవెన్, కాన్సుల్ ఆండ్రూ కాలిస్టర్, ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ కమిషనర్ వికా సింగ్, పొలిటిల్ అండ్ ఎకానమిక్ రీసెర్చ్ ఆఫీసర్ రంజని మాధవన్, డికన్ యూనివర్సిటీ ప్రతినిధులు రౌనీత్ పాహ్వా, ప్రియాంక సింగ్, గాయత్రి వేద్ నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

# దండిగా ఎరువులు ఎంటే ఎందుకు ఇవ్వరు?

**క్యూ లైన్లలో రైతులు పడిగాపులు పడుతుంటే చోద్యమా?**

**ఎరువు కోసం ఏలూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన**

**ఏలూరు,తెలంగాణ దిశ:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ), ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎరువులను సక్రమంగా అందించాలని, బ్లాక్ మార్కెట్లో ఎరువులు అమ్మకాలను అరికట్టాలని, రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతుల సమస్యలు తీరేంతవరకు పోరాడుతామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతుల కష్టాలను తీరుస్తామని, రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత రైతులు పడుతున్న కష్టాలను ఇబ్బందులను తొలగించడానికి ఏమాత్రం ప్రయత్నం చేయడంలేదని విమర్శించారు. రాష్ట్రంలోని రైతులు ఎండనక, వాననక ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు పడుతున్నారని,పెద్ద వయసు కలిగిన రైతులు క్యూ లైన్లలో నిలబడలేక చెప్పులు, కర్రలు, గొడుగులు, క్యూ లైన్లో పెట్టి ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం,అధికారులు ఇవేమి పట్టనట్లు వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయని అబద్ధాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. బ్లాక్ మార్కెట్లో యూరియా బస్తా వంద రూపాయలు అదనంగా, డీఏపీ బస్తా రెండు వందల అదనంగా నల్ల వ్యాపారుల విక్రయిస్తుంటే ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు.నానో ఎరువులను వాడుకోవాలని చెబుతున్న ప్రభుత్వం మాటలు వింటే రైతులు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నానో ఎరువుల కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మ-కై-÷-క కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తుందా అనే సందేహాన్ని వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరి పంట వేయవద్దని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడవద్దని చెప్పడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇటు-వంటి వ్యాఖ్యల వలన రైతాంగానికి, వ్యవసాయానికి తీవ్ర నష్టం జరిగే పరిస్థితి ఉందని, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటు-న్న ఎరువుల కొరత సమస్యను పక్కదారి పట్టించే విధంగా మాట్లాడడం దారుణమని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునే విధంగా అధికారులను సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటు-న్న ఎరువుల కొరతను నివారించే ప్రయత్నం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి తక్షణమే యూరియా,డిఏపి వంటి ఎరువులను అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.??సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎరువుల కొరత వలన అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులకు ఎరువులను సరిపడా అందించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు అన్ని ఎమ్మార్వో కార్యాలయాలు వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు ఎరువులు సరిపడా ఉన్నాయని చెబుతున్నా రాష్ట్రంలోని రైతులు క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు కాస్తున్న విషయం అధికారులు దృష్టికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. క్యూలైన్లలో రైతులను నిలబడవద్దని చెబుతున్న ప్రభుత్వం ఇంటింటికి అందించే కార్యక్రమం ఏమన్నా చేపట్టారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో ఎరువులను వినియోగించాలని చెబుతుంటే రైతులు మాత్రం నానో ఎరువుల వలన పంట దిగుబడి రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం అధికారులు పరిశీలించాలని తెలిపారు.

కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించడం ద్వారా నానో ఎరువులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందా అనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో 70 శాతం మాత్రమే వ్యవసాయం సాగు చేస్తున్నారని అటు-వంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే యూరియా,డిఏపి అధికంగా ఉండాలి గాని కొరత ఎలా వచ్చిందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. 30శాతం సాగు తగ్గినప్పటికీ ప్రభుత్వం ఎరువులను అందించలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉందా అని ప్రశ్నించారు. బ్లాక్ మార్కెట్ కు తరలిపోతున్న యూరియా,డిఏపి లను అరికట్టి కూటమి ప్రభుత్వం తక్షణమే రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరత సమస్యను నివారించాలని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలకు ఇప్పుడు చేస్తున్న పాలనకు పొంతన లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్థాయి నుండి అధికారులు అందరూ రైతులకు ఎరువుల కొరత లేదని అబద్ధాలను చెబుతున్నారని క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటూ రైతులకు యూరియా, డిఏపి అందుబాటులో లేదని తెలిపారు. గత పది రోజులుగా జిల్లా కలెక్టర్ పదే పదే జిల్లాలో ఎరువుల కొరత లేదని చెబుతున్నప్పటికీ జిల్లాలో అనేకచోట్ల రైతులు ఎరువులు కోసం క్యూ లైన్ లలో పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎరువుల కొరత లేనప్పుడు జిల్లా ఇన్చార్జి మంత్రి గారు ఈరోజు ప్రత్యేకించి సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్పకుండా రైతులకు సకాలంలో యూరియా డిఏపి వంటి ఎరువులను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల తహసీల్దార్ గాయత్రికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, ఏరియా కార్యవర్గ సభ్యులు మావూరి విజయ, కొల్లూరి సుధారాణి, కొండేటి రాంబాబు, కొండేటి బేబీ, ఎంఎ హకీం, ఏరియా కౌన్సిల్ సభ్యులు భజంత్రీ శ్రీనివాసరావు, తమ్మిశెట్టి రమణయ్య, దాసిపల్లి ఆదినారాయణ, గుంజే శ్రీను, దాచేపల్లి ఎర్రయ్య, వెదురుపర్తి శారద,షరీఫ్,ముదపాక ధనలక్ష్మి, ముదపాక సత్యనారాయణ,తోట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులకు భయపడొద్దు

**- చట్టాలను సద్వినియోగపర్చుకోండి**

**- జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించండి**

**- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖల**

**భూపాలపల్లి,తెలంగాణ దిశ:** లైంగిక వేధింపులకు గురైనప్పుడు మౌనం వహించాల్సిన అవసరం లేదని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ మరియు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, లైంగిక వేధింపుల నివారణచట్టాలపై సమావేశం నిర్వహించారు. పట్టణంలోని సంఘమిత్రకాలేజీలో జరిగిన కార్యక్రమంలో జడ్జిఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పురుషులతో సమానంగా మహి ళలకు కూడా చట్టాలు ఉన్నాయని తెలిపారు. ఎవరికైనా ఆపద సంభవిస్తే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి మల్లీశ్వరి, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న మహిళా సాధికారత కోఆర్డినేటర్ బి. అనూష, చైల్డ్ హెల్ప్లైన్ కోఆర్డినేటర్ జి. తిరుపతి, సఖి అడ్మినిస్ట్రేటర్ గాయత్రి, మమతా, సురేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# జనంలో ఉండేందుకు కవిత జనం బాట..!

**రంగారెడ్డి,తెలంగాణ దిశ :** ఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి జాగృతి పేరుతో రాజకీయం కాని రాజకీయం చేస్తున్న కవిత నాలుగు నెలల పాటు జనంలో ఉండేందుకు జనం బాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ సమయంలో ఆమెపై సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కవిత,ఆమె భర్త వేల కోట్ల విలువైన భూమిని కబ్జా చేశారని డాక్యుమెంట్లతో సహా కొంత మంది ఎంపీ ఈటల రాజేందర్ కు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూకట్ పల్లి ఎమ్మార్వో కార్యాలయ పరిధిలోని బాలానగర్ సమీపంలో ఎఆఖఒ కు చెందిన సర్వే నంబర్ 2010/4 భూమి లో కవిత భర్త అనిల్ , ఏవీ రెడ్డి అనే వ్యక్తులు కలిసి ఈ కబ్జా చేశారని ఈటలకు అందిన ఫిర్యాదులో ఉంది. ఈ ఏవీ రెడ్డి ముఖ్యమంత్రికి సన్నిహితుడని కూడా వారు ఆరోపించారు. ఓవర్ లాప్ భూ సర్వే నంబర్ల ఆధారంగా చేసుకొని తతంగం నడిపించారని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ భూమి విలువ రెండు వేల కోట్లు ఉంటుందని చెబుతున్నారు. కవిత భర్త అనిల్ పేరు మీదనే ఆ భూమి ఉంది. ఇప్పుడు అక్కడ భారీ నిర్మాణాలు చేస్తున్నారని , ఫ్లాట్స్ కట్టి అమ్మకాలు మొదలు పెట్టారని ..అసలు కవిత భర్త అనిల్ కు ఇక్కడ భూమి ఎలా వచ్చింది అన్నదానికి సమాధానం లేదని వారంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూబదిలీ జరిగిందని, దీంట్లో కవిత భర్త అనిల్ కుమార్ , ఏవీ రెడ్డి ప్రత్యక్షంగా ఉన్నారని వారు చెబుతున్నారు. 20 ఎకరాల భూమిని కాపాడాలని , ఆ ప్రభుత్వ భూముల్లో పాఠశాల , హాస్పిటల్ వంటి ప్రజోపయోగ నిర్మాణాలు జరిగేలా చూడాలని ఈటలను కోరారు. తాము అనేకసార్లు హైడ్రా కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వారు చెబుతున్నారు. ఈ ఆరోపణలు చిన్నవి కాదు. తెర వెనుక ఎవరూ లేకుండా..వచ్చి ఫిర్యాదు చేయరు. తన నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న వ్యవహారం కాబట్టి.. సమాచారం ఉండటంతోనే ఈటల రాజేందర్ తన అనుచరులతో తనకే వినతి పత్రం ఇప్పించుకునేలా చేశారని భావిస్తున్నారు. ఈ ఆరోపణలు ప్రజల్లోకి వెళ్లడానికే ఆయనీ వ్యూహం పాటించి ఉంటారు. ఈ అంశంపై ముందు ముందు మరింత రాజకీయం జరిగే అవకాశం ఉంది.

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

## వ్యవసాయ శాస్త్రవేత్త సతీష్ చంద్ర



**కమాన్‌పూర్,తెలంగాణ దిశ :** నాణ్యమైన విత్తనాలతోనే రైతుకు అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త సతీష్ చంద్ర అన్నారు. కమాన్ పూర్ మండలంలో గల రాజాపూర్, గుండారం, గ్రామలలో 'గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం 'కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగావ్యవసాయ శాస్త్రవేత్త, వ్యవసాయ అధికారులు కూనారం వరి రకాలపై క్షేత్ర ప్రదర్శన చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశం ఏమనగా విత్తన ఉత్పత్తి క్షేత్రాలకు మెలకువలు అందించి వాటి ద్వారా ఉత్పత్తి అయినటువంటి విత్తనాలను తోటి రైతులకు ఇవ్వడం ద్వారా గ్రామాలలో విత్తన స్వయం సమృద్ధి చేయడం మంచిదని అన్నారు.దానికి గాను శాస్త్రవేత్త బెరుకుల ఏరివేత, ప్రస్తుతం పాటించవలసిన సస్యరక్షణ చర్యలుతెలియజేశారు. అదేవిధంగా రాజాపూర్ గ్రామంలో మాడిశెట్టి రమేష్ అనే రైతుకు కే ఎన్ ఎం 12510 వరి విత్తనాలను అందించడం జరిగింది. అట్టి పైరు ప్రస్తుతం ఆరోగ్యంగా పంటకోతకు అనుకూలంగా ఉంది, ఇది బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్ల తట్టుకోవడం గమనించడం జరిగింది అని పేర్కొన్నారు. అదేవిధంగా గుండారం గ్రామంలో గుర్రాల సతీష్ కి కే ఎన్ ఎం 16 38 వరి విత్తనాలను అందించడం జరిగింది అట్టి పైరు ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉంది, ఈ రెండు రకాలు కూడా మిగిలిన వారిపైర్లతో పోల్చుకున్నప్పుడు ఆరోగ్యకరంగా మరియు ఆశ జనకంగా దిగుబడులు అందించే విధంగా ఉన్నాయి అని పేర్కొన్నారు. కావున తోటి రైతులందరూ కూడా ఈ వరి పైరు అందించే దిగుబడులను గమనించి రానున్న రబీ, వానాకాలం ఇట్టి విత్తనాలను రైతులు సాగు చేయగలరని కోరుచున్నాము అని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ బి సతీష్ చంద్ర సీనియర్ శాస్త్రవేత్త హెడ్ ఏ ఆర్ ఎస్ కూనారం, వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ కమాన్ పూర్, వ్యవసాయ విస్తరణ అధికారి అనూష మరియు రైతులు పాల్గొన్నారు.

# అన్నిమంచి శకునాలే...

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ కు అన్నీ శుభశకునాలే. ఒకవైపు విశాఖకు ఐటి దిగ్గజ సంస్థలు వస్తున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు ఒప్పందం కూడా కుదిరింది. ఇదిమిగతా రాష్ట్రాల్లో కూడా చర్చకు దారితీస్తోంది. ఇంకోవైపు అమరా వతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఒకవైపు విశాఖకు ఐటి పరిశ్రమలు.. ఇంకోవైపు అమరావతికి విదేశీ పెట్టుబడులు వరదలా వస్తున్నాయి. ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబు దుబాయ్ పర్యటనలో ఉండగా అక్కడి పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగా శోభ గ్రూప్ చైర్మన్ పిఎన్సి మీనన్ తో చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతిలో అధునాతన లైబ్రరీ ఏర్పాటు కోసం 100 కోట్ల రూపాయల విరాళం ప్రకటించింది శోభ గ్రూప్ ఆఫ్ కంపెనీస్. ఇది నిజంగా అమరావతికి శుభవార్త. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతిని నిర్మించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. నవ నగరాలను నిర్మించి ప్రపంచ పటంలో అమరావతికి చోటు కల్పించాలన్నది చంద్రబాబు లక్ష్యం. అందుకే అహర్నిశలు శ్రమిస్తున్నారు. ప్రపంచం గుర్తించేలా నిర్మాణాలు చేపడుతున్నారు. అందులో భాగంగా వరల్డ్ క్లాసు లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అదే విషయాన్ని తన దుబాయ్ పర్యటనలో శోభ గ్రూప్ చైర్మన్కు చెప్పడంతో ఆయన అంగీకరించారు. 100 కోట్ల రూపాయలు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. చంద్రబాబు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు ఆహ్వానించారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి4 కార్యక్రమం గురించి కూడా ఆయనకు వివరించారు సీఎం చంద్రబాబు.అమరావతిలో 150 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ లైబ్రరీ నిర్మాణం ప్రారంభించిన 24 నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. దీంతో పాటుగా రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీల ఏర్పాటుకు నిర్ణయించారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన మోడల్ లైబ్రరీల నిర్మాణం ఉండనుంది. పెద్ద ఎత్తున దాతల సహకారంతో లైబ్రరీల ఏర్పాటుకు నిర్ణయించింది. విశాఖలో 20 కోట్ల రూపాయలతో మోడల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటుంది. అయితే అమరావతిలో మోడల్ లైబ్రరీ నిర్మాణానికి ఒక అంతర్జాతీయ సంస్థ రూ.100 కోట్లు విరాళంగా ప్రకటించడం మాత్రం ఒక రికార్డ్.

# ఘనంగా కెమిస్ట్రీ వీక్ సంబరాలు

**కరీంనగర్,తెలంగాణ దిశ :**విద్యా రంగంలో రసాయన శాస్త్రానికి చాలా విశిష్టత ఉన్నదని, రసాయన శాస్త్రం ద్వారా అనేక విషయాలను తెలుసుకోగలు గుతామని తద్వారా దైనందిన జీవిత కార్యకలాపాలను సైతం చాలా సులభంగా కొనసాగించగలుగుతామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అధ్యక్షోపన్యాసం చేసి మాట్లాడారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ప్రిన్సిపాల్ రచయిత డాక్టర్ కెప్టెన్ బి.మధుసూదన్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాల హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన అణువులు అద్భుత రసాయన, భౌతిక ధర్మాలతో మన జీవనశైలిని సులభతరం చేస్తున్నాయని పేర్కొన్నారు. రసాయన శాస్త్రంలో అనేక పరమాణు అణువుల లోతుల్లో దాగిన రహస్యాలను అర్థం చేసుకోవాలని, ఆ విషయాలను చాలా సంగ్రహంగా, విశ్లేషణాత్మకంగా తెలుసుకున్నట్లయితే అనేక ఆవిష్కరణలకు బీజం వేయవచ్చని వారు తెలిపారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించి రసాయన శాస్త్రంలో నూతన అధ్యాయాలకు శ్రీకారం చుట్టారని వారు చెప్పారు వైద్యం, వ్యవసాయం, శక్తి కొత్త పదార్థాల తయారీకి రసాయనశాస్త్రం చాలా దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు, ప్రధానంగా రోజువారి కార్యకలాపాలలో ఉపయోగిస్తున్నటువంటి పలు వస్తువులను ఆరోగ్య సంరక్షణకై ఉపయోగిస్తున్నటువంటి పలు ఔషధాలను సైతం రసాయన శాస్త్రం ద్వారా అభివృద్ధి పరుస్తామని వారు తెలియపరచారు కూడు, గూడు, గుడ్డ రసాయన పదార్థాలే అని, రసాయన శాస్త్రంలో పట్టు సాధింప చేయడానికి, పెంపొందించడానికి విచ్చేసినటువంటి ఆత్మీయ అతిథి డాక్టర్ కెప్టెన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అనువుల మధ్య బంధాలను తెలిపేది రసాయన శాస్త్రమని, వివిధ ఆకృతులను సైతం రసాయన శాస్త్రంలో మనం తెలుసుకుంటామని చాలా ఉత్సాహపరిచేటువంటి విషయాలను రసాయన శాస్త్రం ఒకటి అని గుర్తు చేశారు. గుయానా, సత్యేంద్రనాథ్ బోస్, రామకృష్ణన్, సి.వి.రామన్ తదితరులు రసాయన శాస్త్రంలో నిష్ణాతులుగా ఖ్యాతి గడించారని అనేక విషయాలను ఆవిష్కరింప చేశారని గుర్తు చేశారు.

# వైకాపాపై విమర్శలు చేసి ..ఇప్పుడు చేస్తున్నదేమిటి

## అధికార టిడిపిలో మద్యం సిండికేట్ వ్యవహారం రచ్చ



**రాజమండ్రి,తెలంగాణ దిశ :**వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా నకిలీ మద్యం విచ్చలవిడిగా విక్రయిచారని ఎండగట్టిన టిడిపి, ఇతర కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత తామేమీ తీసిపోమన్నట్టు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే నకిలీ మద్యం గుట్టురట్టు అవడంతో అధికార పార్టీ పరిస్థితి పరనింద, ఆత్మస్తుతిలా మారింది. అధికార టిడిపిలో మద్యం సిండికేట్ వ్యవహారం కలకలం రేపింది. ఈ వ్యాపారంలో కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్న అక్రమ వ్యవహారాలు తాజాగా మరోసారి వెలుగులోకి వచ్చాయి. సిటీ ఎంఎల్ఎకు అత్యంత సన్నిహితులలో ఒకరైన ఆ పార్టీ సిటీ ఇన్‌ఛార్జి మజ్జి రాంబాబు సిండికేట్ సభ్యునితో మాట్లాడిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంభాషణలో నగరం, రూరల్‌లో మద్యం సరఫరా, అక్రమ అమ్మకాలు, పర్మిట్‌లపై సిండికేట్ నిర్ణయాలు, మద్యం బాటిల్‌పై ధరలు ఎలా పెంచాలి, బెల్ట్ షాపులు ఎలా నిర్వహించాలి, ఎక్సైజ్ అధికారులకు లంచాలు ఎలా ఇవ్వాలి, ఎవరికి ఎంత శాతం ఇవ్వాలి, ఎలా అడ్డగోలుగా అధిక ధరలకు అమ్మకాలు కొనసాగించాలి అనే అంశాలతో పాటు ఎక్సైజ్ శాఖ పోలీసులు కేసులు పెడితే సామూహికంగా ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలపై ఏకంగా బైలా రాసుకుంటామని సెలవిచ్చారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్‌కు సంబంధించి 39 షాపు నిర్వాహకులు, యజమానులు సమావేశానికి హాజరు కావాలని ఆ సంభాషణ సారాంశం. జిల్లావ్యాప్తంగా 125 వైన్‌షాపులకు, మరో 25 బార్ అండ్ రెస్టారెంట్‌లకు దశలవారీగా ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన విషయం విదితమే. గడిచిన ఏడాది కాలంగా ఈ షాపులకు అనుబంధంగా బెల్ట్‌షాపులు నిర్వహించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారనేది సుస్పష్టం. ఈ అక్రమాలకు భరోసా ఇచ్చేలా అధికార పార్టీ నేత తెలపడం చర్చనీయాంశంగా మారింది. పాలక పెద్దల కనుసన్నలలోనే పాలక పెద్దల కనుసన్నల్లోనే మద్యం సిండికేట్ అక్రమాలకు తెరలేపుతోందనేది సుస్పష్టం. తాజా ఘటనతో పార్టీ ప్రతిష్ట దెబ్బతినడం ఖాయమని తేటతెల్లమవుతోంది. ఈ నేపథ్యంలో మజ్జి రాంబాబు ఫోన్ సంభాషణ తనదు కాదంటూ సమాధానం ఇచ్చారా.. అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. అదే నిజమైతే ఎవరనేది వెల్ల డించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. టిడిపి సిటీ అధ్యక్షునిగా ప్రకటిం చినప్పటికీ మజ్జి రాంబాబు ఇంకా ప్రమాణస్వీకారం చేయలేదు. నగర ఎంఎ ల్‌ఎకు అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయనపై రాజకీయ దురుద్దేశంతో ఇటువంటి కుట్ర చేశారని టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. మద్యం మాఫియాతో లింకులు కలిగి ఉంటే ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందా లేదా అని ప్రశ్న తలెత్తుతోంది. మద్యం సిండికేట్ ఇష్టారాజ్యం రాజకీయ పెద్దల కనుసన్నలలోనే మద్యం సిండికేట్ అక్రమాలకు తెరలేపుతోందని సుస్పష్టం. ఈ ఉదంతంపై తొలుత మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఈ ఆడియోను బహిర్గతం చేయడంతో పాటు మరుసటి రోజు పోలీసు ఉన్నతాధికారులను కలిసి సిండికేట్ అక్రమాలపై ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మజ్జి రాంబాబు సైతం మీడియా ముందుకు వచ్చి తాను మాట్లాడలేదని ఎఐ టెక్నాలజీని వినియోగించుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ వాపోయారు. తన రాజకీయ భవిష్యత్తుపై దురుద్దేశంతోనే మార్గాని భరత్ రామ్ ఇటువంటి చర్యలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. ఈ సమావేశం నిర్వహించిన హోటల్లోనే మద్యం సిండికేట్ సైతం సమావేశం అయింది. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాము ప్రభుత్వ నిబంధనల మేరకే వ్యాపారం చేస్తు న్నామని తమను రాజకీయాల్లోకి లాగొద్దంటూ సెలవిచ్చారు. ఈ ఆడియో వెనుక ఎవరు ఉన్నారనే దానిపై ప్రభుత్వం, లేదా పోలీసుల నుంచి ఇప్పటివరకు ఎటువంటి. అధికార ప్రకటన రాలేదు. ఈ విషయమై మజ్జి రాంబాబును వివరణ కోరగా మద్యం షాపులు నష్టాల్లో కూరుకుపోతున్న నేపథ్యంలో వ్యాపార లావాదేవీలు క్షీణించాయని, ఈ నేపథ్యంలో రాజమండ్రి అర్బన్ రూరల్ ప్రాంతాల్లోని 33 షాపు యజమానులతో స్థానిక హోటల్లో సమావేశం నిర్వహిస్తున్నామని, ఆ సమావేశంలో చర్చించే అంశాలన్నీ ఫోన్‌లో వివరించామన్నారు. మద్యం వ్యాపారంలో ఇలాంటి సమావేశాలు నిర్వహించడం సర్వసాధారణం అని రాంబాబు తెలిపారు.

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

## వ్యవసాయ శాస్త్రవేత్త సతీష్ చంద్ర



**కమాన్‌పూర్,తెలంగాణ దిశ :**నాణ్యమైన విత్తనాలతోనే రైతుకు అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త సతీష్ చంద్ర అన్నారు. కమాన్ పూర్ మండలంలో గల రాజాపూర్, గుండారం, గ్రామలలో 'గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం 'కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్త, వ్యవసాయ అధికారులు కూనారం వరి రకాలపై క్షేత్ర ప్రదర్శన చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశం ఏమనగా విత్తన ఉత్పత్తి క్షేత్రాలకు మెలకువలు అందించి వాటి ద్వారా ఉత్పత్తి అయినటువంటి విత్తనాలను తోటి రైతులకు ఇవ్వడం ద్వారా గ్రామాలలో విత్తన స్వయం సమృద్ధి చేయడం మంచిదని అన్నారు.దానికి గాను శాస్త్రవేత్త బెరుకుల ఏరివేత, ప్రస్తుతం పాటించవలసిన సస్యరక్షణ చర్యలుతెలియజేశారు.

అదేవిధంగా రాజాపూర్ గ్రామంలో మాడిశెట్టి రమేష్ అనే రైతుకు కే ఎన్ఎం 12510వరి విత్తనాలను అందించడం జరిగింది.అట్టి పైరు ప్రస్తుతం ఆరోగ్యంగా పంటకోతకు అనుకూలంగా ఉంది, ఇది బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్ల తట్టుకోవడం గమనించడం జరిగింది అని పేర్కొన్నారు. అదేవిధంగా గుండారం గ్రామంలో గుర్రాల సతీష్ కి కే ఎన్ ఎం 16 38 వరి విత్తనాలను అందించడం జరిగింది అట్టి పైరు ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉంది,

ఈ రెండు రకాలు కూడా మిగిలిన వారిపైర్లతో పోల్చుకున్నప్పుడు ఆరోగ్యకరంగా మరియు ఆశ జనకంగా దిగుబడులు అందించే విధంగాఉన్నాయి అని పేర్కొన్నారు.కావున తోటి రైతులందరూ కూడా ఈ వరి పైరు అందించే దిగుబడులను గమనించి రానున్న రబీ, వానాకాలం ఇట్టి విత్తనాలను రైతులు సాగు చేయగలరని కోరుచున్నాము అని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ బి సతీష్ చంద్ర సీనియర్ శాస్త్రవేత్త హెడ్ ఏ ఆర్ ఎస్ కూనారం, వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ కమాన్ పూర్, వ్యవసాయ విస్తరణ అధికారి అనూష మరియు రైతులు పాల్గొన్నారు.

# ఎరుపు రంగు బట్టలు వేసుకోవద్దు

**అదిలాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో పులి సంచారంతో అటవీ శాఖ అప్రమత్తమైంది. ప్రజలు ఎరుపు రంగు దుస్తులు ధరించవద్దని, ఉదయం 10 తర్వాతే బయటకు వెళ్లి, సాయంత్రం 5 లోపు ఇళ్లకు చేరాలని హెచ్చరికలు జారీ చేశారు. పులి దాడి ఘటనలు భయపెడుతుండటంతో, రైతులు, కూలీలు పొలం పనులకు వెళ్లడానికి జంకుతున్నారు. అధికారులు గస్తీ ముమ్మరం చేశారు. ప్రజలు ఒంటరిగా బయటకు వెళ్లవద్దని పులి కనిపిస్తే.. అరవాలని సూచిస్తున్నారు.తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని జిల్లాల ప్రజలకు అటవీ శాఖ అధికారులు కీలక అలర్ట్ జారీ చేశారు. వారు ఎరుపు రంగు దుస్తులు ధరించవద్దని సూచించారు. అలానే ఉదయం 10 గంటల తర్వాతే బయటకు వెళ్లాలని.. సాయంత్రం 5 గంటల లోపు ఇళ్లకు చేరాలని సూచిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు రాత్రింబవళ్లు గస్తీ కాస్తున్నారు. మరి ఈ స్థాయిలో హెచ్చరికలు జారీ చేయడానికి కారణం ఏంటంటే.. ఈ పరిసర ప్రాంతాల్లో పులి సంచరించడం. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని మెట్ ఇంధాని అటవీ ప్రాంతానికి మహారాష్ట్ర సరిహద్దు నుంచి పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. 2020 నుంచి ఇలా పత్తి పంట చేతికొచ్చే సమయానికి.. అటవీ ప్రాంతానికి దగ్గర ఉన్న గ్రామాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది.పులి.. పశువుల మీదనే కాక.. పొలాల్లో పని చేసే కూలీల మీద కూడా దాడి చేసి చంపేస్తుంది ఈ ఏడాది ఆగస్టు 18న సిర్పూర్ (టి) రేంజి పరిధిలోకి ప్రవేశించిన పులి ఒకటి.. ఆవు మీద దాడి చేసింది. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో పులి తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. ఒక వారం రోజుల నుంచి ఇది మండలంలోని గెర్రెగూడ, రాస్పెల్లి, సార్సాల పరిసరాల్లో సంచరించిన ఆనవాళ్లు వెలుగులోకి వచ్చాయి.మూడు నెలల క్రితం ఈ ప్రాంతానికి వచ్చిన పులి.. వారం రోజుల నుంచి పెంచికల్పేట్, సిర్పూర్(టి), కాగజ్నగర్ అటవీ ప్రాంతంలోని పాతసార్సాల, గెర్రెగూడ, రాస్పెల్లి గ్రామ పరిసరాల్లో సంచరిస్తోంది. పత్తి పంట చేతికి వచ్చిన వేళ.. ఇలా పులి సంచరించడం.. రైతులను భయపెడుతోంది. గతంలో దాడి చేసిన ఘటనలు గుర్తు చేసుకుంటున్న రైతులు, కూలీలు పొలం పనులకు వెళ్లడానికే భయపడుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాల్లో రేయింబవళ్లు గస్తీ కాస్తున్నారు. అటవీశాఖ అధికారులు.. రైతులు, కూలీలకు పలు సూచనలు చేస్తున్నారు. జనాలు ఎవరూ ఒంటరిగా పొలాలకు వెళ్లరాదని సూచిస్తున్నారు. పొలం పనులకు, ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు ఉదయం 10 గంటల తర్వాతే వెళ్లి, సాయంత్రం 5 గంటలలోపే ఇండ్లకు చేరుకోవాలని సూచిస్తున్నారు. అలానే ఎర్రని దుస్తులు ధరించడం వల్ల పులితో ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది కనక.. అలంటి రంగు దుస్తులకు దూరంగా ఉండమని చెబుతున్నారు. అలానే పులి కనిపిస్తే.. వెనక్కి తిరిగి పరిగెత్తకూడదని.. పులికి మన వీపు కనిపిస్తే.. వెంబడించే ప్రమాదం ఉంది కనుక.. అలా చేయవద్దని.. పులి కనిపిస్తే పెద్దగా అరవాలని సూచించారు. ప్రమాదం ఉందని, పెద్దగా అరుపులు చేయాలని సూచిస్తున్నారు. వారం రోజులుగా తమ ప్రాంతంలో పులి సంచరిస్తోందని.. పత్తి తీసే సమయంలో ఇలా పులి సంచారం వల్ల కూలీలు పనులకు రావడానికి భయపడుతున్నారని రాస్పెల్లికి చెందిన రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అటవీ సిబ్బంది గ్రామాల పరిసరాల్లోనే గస్తీ కాస్తున్నట్టు తెలిపారు. ఒంటరిగా ఎవరూ బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు వహిస్తున్నామని అన్నారు.సుమారు 5 సంవత్సరాల క్రితం అనగా.. 2020నవంబరు 11న చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి మీద పులి దాడి చేసి హతమార్చింది. అలానే గత సంవత్సరం అనగా 2024 నవంబర్ 29న గన్నారం గ్రామానికి లక్ష్మి అనే మహిళ చేలో పత్తి తీస్తుండగా.. పులి ఆమె మీద దాడి చేసింది.

# 66వేల పెట్టుబడి.. 660 రూపాయిల ఆదాయం



ముంబై: ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కోయకుండానే కన్నీళు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడిలో పదో వంతు కూడా వారి చేతికి రావడం లేదు. కనీసం పంటను మార్కెట్‌కు తరలించిన ఖర్చులు కూడా రాకపోవడంతో.. అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం.. చేతికొచ్చిన ఆ మాత్రం పంటకు రేటు లేకపోవడంతో భారీ నష్టాలను చవిచూస్తున్నారు. మరికొందరు రైతులు.. పంటను కోసి, వాటిని మార్కెట్‌కు తీసుకెళ్లినా ఆ ఖర్చులు కూడా రావడం లేదని.. పంటను కోయకుండా అలాగే పొలాల్లో వదిలేస్తున్నారు.మహారాష్ట్ర రైతు సుదామ్ ఇంగ్లే ఉల్లి సాగు కోసం రూ.66 వేల పెట్టుబడి పెట్టారు. భారీ వర్షాల కారణంగాపంట దెబ్బతినడంతో.. 7.5 క్వింటాళ్ల ఉల్లి పంట మాత్రమే వచ్చింది. ఆ ఉల్లి పంటను మార్కెట్‌కు తరలించగా.. రవాణా ఖర్చులు పోను ఆయనకు కేవలం రూ. 664 మాత్రమే మిగిలాయి. పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో ఆవేదన చెందిన సుదామ్ ఇంగ్లే.. మిగిలిన పంటను అమ్మడం కంటే పొలానికి ఎరువుగా మార్చడమే మేలు అని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఎడతెరిపి లేని వర్షాలు, ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని.. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ దయనీయ పరిస్థితి మహారాష్ట్రలోని ఉల్లి, టమోటా, సోయాబీన్ వంటి అనేక పంటలు సాగు చేసే రైతులందరిదీ అని ఈ వార్త తెలియజేస్తోంది. పంట కోసం ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు ఈసారి మిగిలింది కన్నీరేనని తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది.

పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి రాకపోగా.. కనీసం మార్కెట్‌కు పంటను తరలించిన రవాణా ఖర్చులూ దక్కని దయనీయ పరిస్థితి మహారాష్ట్ర రైతన్నలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.మహారాష్ట్ర పూణే సమీపంలోని పురందర్‌కు చెందిన రైతు సుదామ్ ఇంగ్లే.. తన పొలంలో ఉల్లి సాగు కోసం సుమారు రూ.66 వేలఖర్చు చేశారు. అయితే ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. అయినప్ప టికీ.. కొంత భాగాన్ని కాపాడి దాన్ని బస్తాల్లో నింపి.. రూ.1,500 ఖర్చు చేసి పురందర్ మార్కెట్ యార్డుకు తరలించారు.అక్కడ 7.5 క్వింటాళ్ల ఉల్లిపాయలను విక్రయించగా.. రవాణా, లోడింగ్ ఖర్చులు (రూ. 1,065) పోను ఆయన చేతికి వచ్చింది కేవలం రూ. 664 మాత్రమే. అంటే రూ.66 వేలు ఖర్చు పెడితే కనీసం వెయ్యి రూపాయలు కూడా మిగలలేదు. ఆ రైతు అమ్మిన ఉల్లిపాయలు నష్టం ఆధారంగా కిలోకు రూ. 3, రూ. 2, రూ. 10 చొప్పున అమ్ముడుపోయాయని తెలుస్తోంది.తనకు జరిగిన నష్టాన్ని చూసి సుదామ్ ఇంగ్లే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక ఎకరం భూమి నుంచి వచ్చిన పంట మాత్రమేనని.. తనకు మరో ఒకటిన్నర ఎకరాల్లో ఉల్లి పంట ఉందని పేర్కొన్నారు. దాన్ని మార్కెట్‌కు తీసుకెళ్లి మరింత నష్టపోవడం కంటే.. రోటవేటర్ వేసి పొలానికి ఎరువుగా మార్చేస్తానని చెప్పారు. అమ్మడం కంటే అదే లాభదాయకమని వాపోయారు. తన లాంటి పెద్ద రైతులపరిస్థితే ఇలా ఉంటే..అప్పులు చేసి సాగుచేస్తున్నచిన్న రైతులు ఎలా బతకాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించక పోతే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతాయని ఆయన హెచ్చరించారు. మహారాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలు.. పడిపోతున్న ధరలు అన్నదాతల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఉల్లిపాయలు, టమోటాలు, బంగాళాదుంపల నుంచి దానిమ్మ, సీతాఫ లం, సోయాబీన్ వరకు దాదాపు ప్రతీ పంట పండించిన రైతుకు ఈ సీజన్‌లో ఇలాంటి పరిస్థితే ఎదురైందని చెబుతున్నారు. నాసిక్ ప్రాంతంలో ఏకంగా 80 శాతం ఉల్లిపాయ పంట వర్షాల కారణంగా దెబ్బతినగా.. కాపాడిన పంట కూడా నాణ్యత లేకపోవడం వల్ల అతి తక్కువ ధరలకు అమ్ముడవుతోంది. చేతిలో డబ్బు లేకపోవడంతో రైతులు కొనుగోలు శక్తిని కోల్పోయారు. దీంతో గ్రామీణ మార్కెట్లలో దీపావళి కళ పూర్తిగా కరువైంది. నగరాల్లో మాత్రమే దీపావళి వేడుకలు జరుగుతున్నాయని.. పల్లెల్లో దీపం కొనుక్కోవడానికి కూడా డబ్బు లేదని పేర్కొంటున్నారు.రైతులు ప్రభుత్వ విధానాలను కూడా తప్పుబట్టారు. 2023లో ఉల్లి ధరలు పెరిగినప్పుడు కేంద్రం ఎగుమతులను నిషేధించడం వల్ల ఇతర దేశాలు అంతర్జాతీయ మార్కెట్‌ను ఆక్రమించాయని, దీనివల్ల భారతదేశం తమ ఎగుమతి వాటాను కోల్పోయిందని ఆరోపించారు. ధరలు పెరిగినప్పుడు ఎగుమతిని నిషేధించిన ప్రభుత్వం.. మార్కెట్ ధరలు కుప్పకూలిన ప్పుడు గిట్టుబాటు ధర ఇచ్చి ఉల్లి పంటను కొనుగోలు చేయదా అని ప్రశ్నించారు. వ్యవసాయం అంటే కష్టాల జీవితమేనా అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

# నక్వీకి వార్నింగ్

ముంబై: పాకిస్తాన్ దేశమే కాదు.. అక్కడి పాలకులు కూడా దుర్మార్గులే. ఇది అనేక సందర్భాల్లో నిరూపితమైంది. ఇప్పుడు కూడా నిరూపితం అవుతోంది. చివరికి క్రికెట్ జట్టును పర్యవేక్షించే వ్యక్తులు కూడా దుర్మార్గంగానే వ్యవహరిస్తున్నారు. భారత్ మీద విషాన్ని కక్కుతున్నారు. ప్లేయర్లు మాత్రమే కాదు.. బోర్డును పర్యవేక్షించేవారు కూడా ఇలా వ్యవహరించడం పట్ల యావత్ క్రికెట్ ప్రపంచం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.ఇటీవల ఆసియా కప్ జరిగింది. ఇందులో టీమిండియా ఫైనల్ మ్యాచ్లో పాకిస్తాన్ జట్టుపై అద్భుతమైన విజయం సాధించింది. ట్రోఫీ అందుకునే విషయంలో టీమిండియా నిరసన వ్యక్తం చేసింది. పహల్గాం దాడి, సరిహద్దు వద్ద ఉద్రిక్తతలు వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని టీమిండియా ఎసిసి చీఫ్, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మోసిన్ నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడానికి ఆసక్తిని ప్రదర్శించలేదు. టీమిండియా ప్లేయర్ల నిరసన నేపథ్యంలో ఎసిసి చీఫ్ ఆసియా కప్, మెడల్స్ తన వెంట తీసుకొని పోయారు.నక్వీ వ్యవహరిస్తున్న తీరు పట్ల భారత క్రికెట్ మేనేజ్మెంట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆసియా కప్ ఫైనల్ జరిగిన రెండు రోజుల తర్వాత ఎసిసి ఎజిఎం సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు ఎసిసి చీఫ్ కు గట్టి హెచ్చరికలు పంపించింది. ట్రోఫీ సరైన విధానాల్లో పంపించాలని.. లేకపోతే పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. కాదు అధికారిక ఈమెయిల్ ద్వారా కూడా సందేశం పంపించింది. అయితే ఇప్పటివరకు ఏసీసీ చీఫ్ నుంచి ఎటువంటి ప్రత్యుత్తరం రాలేదు. దీంతో ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలికి తెలియజేస్తామని ఇప్పటికే భారత క్రికెట్ యాజమాన్యం ప్రకటించింది. ట్రోఫీని తమ వద్దకు ఎలా రప్పించుకోవాలో తెలుసని.. ఎందుకు దశలవారీగా ముందుకు సాగుతామని భారత క్రికెట్ యాజమాన్య ప్రకటించింది.. అయితే ఎసిసి కార్యాలయంలో భారత జట్టుకు ట్రోఫీ అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని నక్వీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎసిసి చీఫ్ గా మాత్రమే కాకుండా, నక్వీ పాకిస్తాన్ మంత్రిగా కూడా ఉన్నారు. దీంతో అతని చేతుల మీదుగా ఎట్టి పరిస్థితుల్లో ట్రోఫీని తీసుకునే పరిస్థితి లేదని బీసీసీ స్పష్టం చేసింది. అయితే అంతర్జాతీయ మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం ఆసియా కప్ దుబాయ్ లోని ఏసీసీ కార్యాలయంలోనే ఉందని తెలుస్తోంది. అయితే ఆ ట్రోఫీని తన అనుమతి లేకుండా బయటికి తరలించకూడదని.. ఇతరులకు అప్పగించకూడదని నక్వీ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

# ఎంపీగానే రాఘవరెడ్డి పోటీ...

**ఒంగోలు,తెలంగాణ దిశ :** ఊహించిందే జరిగింది. ఒంగోలు ప్రజలకు అంతో క్లారిటీ ఉంది. ఆయన కూడా అదును చూసి ప్రకటన చేశారు. బర్త్ డే సందర్భంగా..సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చారు ఒంగోలు టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని అంటూనే..తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేస్తారని తెలిపారు. చంద్రబాబు ఆదేశాల ప్రకారమే గత ఎన్నికల్లో తాను పోటీ చేశానని చెప్పుకొచ్చారు.మాగుంట కుటుంబ రాజకీయ వారసుడిగా రాఘవరెడ్డిని రంగంలోకి దింపాలని శ్రీనివాసులు రెడ్డి ఎప్పటి నుంచో ఆరాటపడుతున్నారు. వయస్సు మీద పడుతుండటంతో తన కుటుంబ వారసుడిని రంగంలోకి దింపేందుకు ఇదే కరెక్ట్ సమయమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లోనే టీడీపీ నుండి తన కుమారుడిని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపేందుకు శతవిధాలా ప్రయత్నించారు ఎంపీ మాగుంట. మొన్నటి సారి ఎంపీగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గిద్దలూరు లేదా దర్శి అసెంబ్లీ నుంచి మాగుంట కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. కానీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు రాఘవరెడ్డి ఆసక్తి చూపలేదట.టీడీపీ అధిష్టానం రాఘవరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా పరిగణలోకి తీసుకున్నా.. సర్వేల్లో మాగుంట శ్రీనివాసులురెడ్డికే ప్రజలు ఓటేశారని ఆయన వైపే మొగ్గు చూపారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రాఘవరెడ్డిపై ఆరోప ణలు..అరెస్టులు వంటి కీలక పరిణామాలతో తప్పని పరిస్థితుల్లో మాగుంటనే బరిలో దింపింది టీడీపీ అధిష్టానం. ఓవైపు వయోభా రం..మరోవైపు తన కుమారుడి పొలిటికల్ ఎంట్రీ కోసం ఆశపడు తున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి..తన తనయుడు రాజకీయ అరంగేట్రానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట. తాను రాజకీయాల్లో యాక్టీవ్‌గా ఉన్నప్పుడే తన కుమారుడిని వారసుడిగా లైన్‌లోకి దింపి తమ కుటుంబ చరిష్మాను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉన్నారట మాగుంట. దీంతో జన్మదిన వేడుకల సందర్భంగా తన మనసులో మాటను మరోసారి బయటపెట్టారు ఎంపీ మాగుంట.రాఘవరెడ్డి ఇప్పటికే పొలిటికల్‌గా యాక్టీవ్‌గా ఉంటున్నారు. తన తండ్రి శ్రీనివాసులురెడ్డి రాజకీయ వ్యవహారాలతో పాటు వ్యాపారాల్లో చేదోడువాదోడుగా ఉంటూ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల టైమ్‌లో కూడా రాఘవరెడ్డి ప్రచారం చేశారు. మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒంగోలు పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల తర్వాత కూడా యాక్టీవ్‌గా ఉంటూ వస్తున్నారు రాఘవరెడ్డి. నియోజకవర్గాల వారీగా నేతలను కలుస్తూ..సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపుతున్నారు. అటు యువతతో..ఇటు సీనియర్ నేతలతో కోఆర్డినేట్ చేసుకుంటూ అందరికీ దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు.ఫ్యామిలీకి 30 ఏళ్ల పొలిటికల్ ట్రాక్ రికార్డు ఉంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి తన సోదరుడు మాగుంట సుబ్బిరామిరెడ్డి మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. 1998, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఒంగోలు నుంచి ఎంపీగా విజయం సాధించారు. 2014 ఎన్నికలప్పుడు మాగుంట కాంగ్రెస్ పార్టీకి రిజైన్ చేసి టీడీపీలో చేరి 2014లో ఒంగోలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2015లో ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల తరుపున ఎమ్మెల్సీగా గెలిచారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి..2024 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి గెలిచారు మాగుంట శ్రీనివాసులురెడ్డి. ఇక ఇప్పుడు తన ఫ్యామిలీ రాజకీయ వారసత్వాన్ని కంటిన్యూ చేసేందుకు కొడుకు రాఘవరెడ్డిని బరిలోకి దింపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మరి మాగంటి వారసుడిగా రాఘవరెడ్డి పాలిటిక్స్‌లో ఎంతవరకు రాణిస్తారో చూడాలి మరి.


# రైల్వే టిక్కెట్ రీ షెడ్యూల్ అవకాశం




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశంలో ప్రతిరోజూ కోట్లాది మంది ప్రజలు రైలులో ప్రయాణం చేస్తున్నారు. ఈ ప్రయాణికుల కోసం రైల్వే శాఖ వేలాది రైళ్లను నడుపుతోంది. తద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అయితే, కొన్నిసార్లు ప్రయాణం ఫిక్స్ చేసుకున్నాక అనుకోకుండా మీ జర్నీ ప్లాన్ మారుతుంది. అతి కష్టమ్మీద బుక్ చేసుకున్న టికెట్ రద్దు చేసుకుంటే మళ్లీ బుక్ చేసుకోవడం కష్టమే.మీరు టిక్కెట్‌ను క్యాన్సిల్ చేసుకోవల సిన అవసరం లేదని రైల్వేశాఖ చెబుతోంది. టికెట్ క్యాన్సిల్ సమస్యను పరిష్కరించడానికి, భారత రైల్వేశాఖ ఇప్పుడు ఒక కొత్త నియమాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, మీజర్నీ తేదీ మారితే, టికెట్‌ను క్యాన్సిల్ చేయవలసిన అవసరం లేదు. మీరు ఇదివరకు బుక్ చేసుకున్న టికెట్‌తో మరేదైనా తేదీలో ప్రయాణించ వచ్చు. అయితే రైల్వేశాఖ ఇందుకోసం కొన్ని షరతులు విధించింది. ఈ కొత్త నియమం ఎలా పని చేస్తుంది, ఎవరికి ప్రయోజనం చేకూరుస్తుందో ఇక్కడ తెలుసుకోండి. టికెట్ బుకింగ్ సిస్టమ్‌లో పెద్ద మార్పులు చేయడానికి భారతీయ రైల్వేశాఖ సిద్ధమవుతోంది. ఇప్పుడు ప్రయాణికులు టికెట్‌ను రద్దు చేయకుండా, వారి ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు. ఉదాహరణకు.. మీరు నవంబర్ 20న రైలు టికెట్ బుక్ చేసుకుంటే, జర్నీని నవంబర్ 22కి వాయిదా వేసుకోవాల్సి వస్తే.. అదే టికెట్‌ను రీషెడ్యూల్ చేయవచ్చు. ఈ సౌకర్యం ఎఖీఉఅ పోర్టల్ లేదా యాప్ ద్వారా బుక్ చేసుకున్న కన్ఫర్మ్ టిక్కెట్‌లకు మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రైల్వే ప్రయాణికులు పాత టికెట్‌ను రద్దు చేసుకుని, కొత్త టికెట్‌ను బుక్ చేసుకుంటున్నారు. తద్వారా టికెట్ క్యాన్సిల్ ఛార్జీలు చెల్లించాలి. కొత్త రూల్ ద్వారా ఈ ఇబ్బంది ఉండదు. కొత్త తేదీలో రైలు ఛార్జీలు ఎక్కువగా ఉంటే, ప్రయాణికుడు పెరిగిన ఛార్జీల వ్యత్యాసాన్ని చెల్లించాలి. ఈ మార్పు ప్రయాణికులకు రైల్వే డిజిటల్ సేవలను మరింత సౌకర్యవంతంగా చేస్తుంది.ఈ కొత్త నియమం ప్రయాణికులకు టికెట్ రద్దు చేయకుండా, వినియోగించుకునేందుకు ఉపశమనం కలిగిస్తుంది. చాలాసార్లు అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటారు.దీనివల్ల టికెట్‌ను రద్దు చేస్తే 25 శాతం నుండచి 50 శాతం వరకు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మరీ ఆలస్యమైతే ఎలాంటి రీఫండ్ కూడా ఉండదు. ఇకనుంచి రైల్వే ప్రయాణికులు తమ టికెట్‌ను రద్దు చేయకుండా ప్రయాణించాలని యోచిస్తోంది. అందుకు బదులుగా ట్రావెల్ డేట్ అప్‌డేట్ చేసుకుంటే సరిపోతుంది. రైల్వేశాఖ కొత్త రూల్ ద్వారా ప్యాసింజర్స్ సమయం, డబ్బు రెండు ఆదా అవుతాయి. కొత్త తేదీలో అదే సీటు మళ్లీ కన్ఫర్మ్ అవుతుందని కాదు. సీటు లభ్యత ఆధారంగా టికెట్ నెంబర్ మారుతుంది. నివేదికల ప్రకారం, రైలు మిస్ అయిన సందర్భంలో కూడా ప్రయాణికులకు పాక్షిక రీఫండ్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా విడుదల కాలేదు.

# టీచర్లకు టెన్షన్..

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత తప్ప నిసరిచేసింది ఎన్‌సీటీఈ. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లగా అత్యున్నత న్యాయ స్థానం కూడా నిర్ణీత గడువులోగా టెట్ అర్హత సాధించాలని స్పష్టం చేసింది. టెట్ లేనివారికి పదోన్నతులు, ఇంక్రిమెంట్ల విషయంలో ప్రాధాన్యం ఇవ్వొద్దని పేర్కొంది. అయితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే విధుల్లో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలన్న వినతిని ఎన్‌సీటీఈ తాజాగా పూర్తిగా తిరస్కరించింది. గతంలో ఎంపికైన ఉపాధ్యాయులకు కొంత వెసులుబాటు ఇవ్వాలని సంఘాలు, టీచర్లు రాసిన పత్రాలను తోసిపుచ్చింది.ఇటీవల సుప్రీం కోర్టు తీసుకున్న కీలక నిర్ణయం ప్రకారం,ఏ ప్రభుత్వ టీచర్ అయితే 5 ఏళ్లకు పైగా సర్వీసు పూర్తి చేశాడో, అలాంటి ప్రతీ ఒక్కరూ రెండు సంవత్సరాల వ్యవధిలో టెట్ అనివార్యంగా ఉత్తీర్ణత సాధించాల్సిందే. ఇది ఇటీవల 2017లో పార్లమెంట్‌లో దిద్దుబాటు చేసిన నిబంధనలకు అనుగుణంగా తీసుకున్న తీర్పు కావడం గమనార్హం. సుప్రీం ధర్మాసనం చెప్పిన తీర్పును 2017లో పార్లమెంట్ చేసిన తీర్మానాన్నే ఆధారంగా చూపారు. అయితే, టీచర్లు తమ నియామకాలు అంతకు ముందు జరిగాయని, కొత్త నిబంధనల ప్రభావం అందరికీ వర్తించకూడదని అభ్యర్థించినా, ఆ వాదనలను ఎన్‌సీటీఈ పరిగణనలోకి తీసుకోలేదు. టెట్ అభ్యర్థన విషయంలో వచ్చిన వినతులను ఎన్‌సీటీఈ తిరస్కరించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర నిరాశ నెలకొంది.




ఇప్పటికే విధుల్లో ఉన్నవారు కూడా టెట్ ఉత్తీర్ణత కీలకంగా మారడంతో, ఉద్యోగ భద్రతపై అనేక మంది ఆందోళన చెందుతున్నారు.

తాజా నిర్ణయానికి కొంతకాలపాటు గరిష్ఠ గడువు ఇచ్చినా, పరీక్ష పాస్ అయేంత వరకు ఒత్తిడి తొలగదు.నూతన విధానాల అమలులో నాన్?టెట్ టీచర్లకు ఇక వెసులుబాటు లేకుండా మారింది.

ఎన్నాళ్లుగా డ్యూటీలో ఉన్నా టెట్ అర్హత తప్పదు. విద్యారంగంలో నాణ్యతను పెంపొందించేందుకు తీసుకుంటున్న ఈ మార్గం కొంతమందికి సవాళ్లను, మరికొంతమందికి నూతన అవకాశం కావచ్చు.

# నకిలీలు... మోసాలు...

**ఆర్మూరు,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వలసలు కాస్త తగ్గాయి. కానీ ఐదేళ్లుగా మళ్లీ విదేశాలకు వలసలు పెరుగుతున్నాయి. పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ఎన్నో కుటుంబాలకి విదేశీ ఉద్యోగాలంటే గొప్ప ఆశ. స్థిరమైన ఉపాధి, మంచి జీతం, కుటుంబ జీవన ప్రమాణం మెరుగుండా మారుతుందని భావిస్తూ వేల మంది, ముఖ్యంగా గల్ఫ్ దేశాల వెలుపలికి వలస వెళుతున్నారు. నిరక్షరాస్యులు సాదాసీమ ఉద్యోగాలకు సిద్ధపడగా, విద్యావంతులు మెరుగైన అవకాశాల కోసం ప్రయత్నిస్తూ ఉంటున్నారు.విదేశీ మోజును కొందరు ఏజెంటు మోసాలకు పాల్పడుతున్నారు. విదేశాల్లో చోటుచేసే ఉద్యోగ అవకాశాల పేరిట డబ్బులు దండుకుని మోసం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేని సంస్థలు, వ్యక్తులు అక్రమ రీతిలో వలస అవకాశాలు కల్పిస్తున్నారని ప్రతీ ఏడాది కేసులు నమోదవుతున్నాయి. వేలాది మంది రూ. లక్ష నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించి విదేశాలకు వెళ్తున్నారు. అక్కడకు వెళ్లాక సరైన ఉద్యోగం లేక మోసపోతున్నారు.నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాలకి చెందిన చాలా మంది ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారు. విదేశాలలో ( జోర్డాన్, ఇజ్రాయెల్ సరిహద్దు) అసాధారణ పరిస్థితుల్లో ఉన్నారు. కొందరు ఏజెంట్లను సంప్రదించగా, 'మీరు అమ్ముడయ్యారు' అనే భయంకరమైన సమాధానం ఇచ్చారు. మూడు లక్షల రూపాయలకు పైగా అప్పులు చేసి విదేశాలకు వెళ్లడం తీరని మోసానికే నిదర్శనం.బాధితులకు కొంత మేర సాయం తోటి తెలుగువారూ, ఎన్నారై సంఘాలూ అందిస్తున్నాయి. కొందరు వారి ద్వారా తల్లిదండ్రుల వద్దకు తిరిగిరాగలుగుతున్నారు. కానీ పెద్దశాతం వలసదారులు విదేశాల్లో దుర్భర జీవితాన్ని కొనసాగే పరిస్థితి. దేశంలో విదేశీ వలసలు, మానవ వనరుల చట్టాల ప్రకారం కన్సల్టెన్సీలు రిజిస్టర్ అయి ఉండాలి. తెలంగాణలో మంజూరైనవి 160 ఉండగా, నకిలీ ఏజెంట్లు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. రెండేళ్లలో వలస మోసాల కేసుల్లో అనేకమంది అరెస్ట్ అయ్యారు.విదేశీ వలసల్లో తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు అక్రమ ఏజెన్సీల మోసాలు, గుర్తింపు ఉన్న సంస్థల కొరత, బాధితులకు వ్యవస్థబద్ధమైన సహాయం లేకపోవడం. మరింత ప్రభావవంతమైన ప్రభుత్వ చర్యలు, ప్రజలకు అవగాహన, చట్టసంబంధ సమాచారం అవసరమన్నది తాజా ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి.

## ముంబైలో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఓ వాణిజ్య భవనంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జోగేశ్వరి వెస్ట్ ఏరియాలోగల జేఎంఎస్ బిజినెస్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పుతున్నారు. భవనం పై అంతస్తులో పలువురు చిక్కుకున్నారు. వారిని కిందకు దించేందుకు రెస్క్యూ టీమ్స్ ప్రయత్నిస్తున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

# సినిమా..

## రష్మిక మందన్నా మైసా టీంతో ప్రభాస్ కల్కి 2898 ఏడీ స్టంట్ మాస్టర్






పుష్ప ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్ డమ్ సంపాదించింది కన్నడ హీరోయిన్ రష్మిక మందన్నా. ఈ భామ లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం మైసా. ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రాజెక్ట్‌కు పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. అంతేకాదు యాక్షన్ బ్లాపై పనిచేసేందుకు ఇప్పటికే ఆండీ లాంగ్ గ్యుయెన్ టీం కేరళలో ల్యాండింగ్ కూడా అయినట్టు సమాచారం. షూటింగ్ కూడా త్వరలోనే మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. రష్మిక మందన్నా సినిమాలో తారక్ పొన్నప్ప నటించడం ఇది రెండోసారి. Rawindra Pulle మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ విడుదల చేయగా.. గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయమని చెప్పకనే చెబుతోంది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నాను మరి కొత్త దర్శకుడు మైసా సినిమాలో ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## హీరోయిన్‌గా కృష్ణ మనవరాలు..




తెలుగు సినీ పరిశ్రమలో ఘట్టమనేని కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. నటశేఖర కృష్ణ వారసత్వాన్ని అందిపుచ్చుకుని సూపర్‌స్టార్‌గా ఎదిగారు మహేశ్ బాబు. ఇప్పుడు అదే కుటుంబం నుంచి మూడో తరం వారసురాలు వెండితెర అరంగేట్రానికి సిద్ధమయ్యారు. సూపర్‌స్టార్ కృష్ణ మనవరాలు, ఆయన కుమార్తె మంజుల-సంజయ్ స్వరూప్ దంపతుల కుమార్తె జాన్వి స్వరూప్ ఘట్టమనేని హీరోయిన్‌గా పరిచయం కాబోతున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా ఈ వార్త వెలువడింది. మహేశ్ బాబు మేనకోడలైన జాన్వి స్వరూప్, త్వరలోనే ఓ సినిమాతో కథానాయికగా ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ సందర్భంగా ఆమెకు సోషల్ మీడియాలో పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో నటి వస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదల చేసిన ఆమె ఫొటోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పసుపు రంగు టాప్, ఆకుపచ్చ ప్యాంట్‌తో ఉన్న ఫొటోలో జాన్వి లుక్ ఫ్రెష్‌గా, ఆకట్టుకునేలా ఉంది. నిజానికి జాన్వికి నటన కొత్తేమీ కాదు. 2018లో తన తల్లి మంజుల దర్శకత్వం వహించిన 'మనసుకు నచ్చింది' చిత్రంలో జాన్వి ఓ చిన్న పాత్రలో కనిపించారు. అయితే, ఈసారి పూర్తిస్థాయి హీరోయిన్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తాత, మామయ్యల బాటలో నటిగా రాణించాలని వస్తున్న జాన్వి తొలి సినిమా వివరాలు, దర్శకుడు, హీరో వంటి ఇతర విశేషాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మరో తెలుగు దర్శకుడితో?




తమిళ అగ్ర హీరో సూర్య తెలుగు సినిమాలపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. ఇప్పటికే ఆయన వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. దీని తర్వాత మరో తెలుగు దర్శకుడి కథకు కూడా సూర్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఆ దర్శకుడెవరో కాదు, బ్లాక్‌బస్టర్ 'గీతగోవిందం' దర్శకుడు పరశురామ్. ఇటీవలే సూర్యకు పరశురామ్ ఓ కథ వినిపించారట. సూర్యకు కూడా కథ బాగా నచ్చడంతో నటించేందుకు ఓకే చెప్పారట. ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తారని సమాచారం. ఇదిలా వుంటే, వెంకీ అట్లూరి సినిమా తర్వాత ఓ తమిళ సినిమాకు కమిటయ్యా రు సూర్య. ఆ సినిమా తర్వాత పరశురామ్ సినిమా చేయాలని సూర్య భావిస్తున్నారట. అయితే.. పరశురామ్ మాత్రం వెంకీ సినిమా వెంటనే తన సినిమా చేయాలని పట్టుబడుతున్నాడని తెలుస్తున్నది.

## వారికంటే తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్నా..



హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటిస్తూ ప్రేక్షకులను మైమరపించిన వారిలో ప్రియమణి ఒకరు. ఒకప్పటి హీరోయిన్ అయినప్పటికీ ఇప్పటికీ తన నటనతో ఇండస్ట్రీలో సత్తా చూపిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ చిత్రాలతో పాటు వెబ్‌సిరీస్‌ల్లోనూ నటిస్తోంది. త్వరలో 'ది ఫ్యామిలీ మ్యాన్-3' వెబ్ సిరీస్‌తో రాబోతుంది. ఈనేపథ్యంలో.. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ప్రియమణి ఇండస్ట్రీలో పరిస్థితుల గురించి షాకింగ్ విషయాలు బయటపెట్టింది. పారితోషికం, షూటింగ్ టైమింగ్స్ ఇష్యూపై స్పందించింది. "నేనెప్పుడూ రెమ్యునరేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వలేదు. నాకున్న మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శక నిర్మాతలను అందుకు తగినట్లుగా పారితోషికం ఇవ్వమని అడిగేదాన్ని. చాలా సందర్భాల్లో నా తోటి నటించిన వారికంటే తక్కువ రెమ్యునరేషన్ తీసుకున్నాను. నా పాత్ర, నిడివి చూసుకొని సినిమాలను అంగీకరిస్తాను. కానీ డబ్బులు ఎంత ఇస్తున్నారనేది నేను పట్టించుకోను. ఆ పాత్రకు నేను అర్హురాలిని అని భావిస్తే మాత్రమే పారితోషికం పెంచమని డిమాండ్ చేసేదాన్ని అంతేకానీ అనవసరంగా ప్రతిసారి పారితోషికం పెంచమని కోరలేదు. ఇన్నాళ్లుగా నేను ఇండస్ట్రీలోని హీరోలకంటే నేను తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్నా" అని చెప్పింది. అంటే అనవసరంగా కొంతమంది సెలబ్రిటీలు పారితోషికం పెంచమని అడుగుతున్నారని చెప్పకనే చెప్పింది.

## మెడలో పాముతో ప్రియాంక చోప్రా...





అంతర్జాతీయ నటి ప్రియాంక చోప్రా తన సాహసోపేతమైన చర్యలతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు చూసి నెటిజన్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఒక భారీ పామును ఆభరణంలా మెడలో చుట్టుకుని ఆమె దిగిన ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ప్రియాంక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫోటోలు, ఒక వీడియోను పోస్ట్ చేశారు. తెల్లటి టాప్, డెనిమ్ జీన్స్, స్టైలిష్ బ్యాండనాతో ఉన్న ఆమె, మెడలో ఒక పెద్ద పామును వేసుకుని ఎంతో ధైర్యంగా కెమెరాకు పోజులిచ్చారు. ఆమెతో పాటు భర్త, ప్రముఖ సింగర్ నిక్ జొనాస్ కూడా ఉన్నారు. ప్రియాంక పాముతో చాలా సౌకర్యంగా కనిపించినప్పటికీ, నిక్ జొనాస్ ముఖంలో మాత్రం కాస్త భయం, అసౌకర్యం స్పష్టంగా కనిపించాయి.

ఈ పోస్ట్‌లోని ఒక వీడియోలో నిక్ జొనాస్.. "బేబ్, నీ కొత్త జ్యువెలరీ చాలా బాగుంది" అని అనగా, ప్రియాంక తనదైన శైలిలో స్పందిస్తూ, "థ్యాంక్స్, ఇదే నా కొత్త సెర్పెంటి (పాము ఆకారంలో ఉండే ఆభరణం)" అని బదులిచ్చారు. ఈ పోస్ట్‌తో పాటు, గతంలో తాను పాములతో దిగిన పాత ఫోటోలను కూడా ఆమె పంచుకున్నారు. అందులో ఒకటి 2011లో వచ్చిన '7 ఖూన్ మాఫ్' సినిమాలోనిది కాగా, మరొక ఫోటోలో నాగుపామును చేతితో పట్టుకుని కనిపించారు. తాను 'ది జంగిల్ బుక్' సినిమాలో 'కా' అనే పాము పాత్రకు వాయిస్ ఓవర్ ఇచ్చిన పోస్టర్‌ను కూడా జత చేశారు.

ఈ పోస్ట్‌పై నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటూ, "ది జంగిల్ బుక్‌లో మీ వాయిస్ అద్భుతం" అని కామెంట్ చేయగా, మరికొందరు నిక్ ముఖంలోని భయాన్ని చూసి నవ్వుల ఎమోజీలు పోస్ట్ చేశారు. అయితే, జంతు ప్రేమికుల నుంచి విమర్శలు కూడా వెల్లువెత్తాయి. "వినోదం కోసం జంతువులను వాడటం సరికాదు. వాటికి కూడా ప్రాణం, భావాలు ఉంటాయి. వాటి అనుమతి లేకుండా మనం వాటిని వాడుకోకూడదు. ఈ భూమిని పంచుకుంటున్న తోటి జీవులను గౌరవించడం నేర్చుకోవాలి" అంటూ ఒక యూజర్ తీవ్రంగా స్పందించారు.

## ఏంటి.. శర్వానంద్ ఇలా మారిపోయాడు..



యంగ్ హీరో శర్వానంద్ తన కెరీర్‌లో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్నాడు. ఫ్యామిలీ, యూత్‌ఫుల్ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన ఇటీవల 'మనమే' సినిమాతో ప్రేక్షకులని పలకరించాడు. ఈ సినిమా ఆశించిన స్థాయిలో హిట్ కాలేదు. ఇప్పుడు బౌన్స్ బ్యాక్ అవ్వాలని శర్వా ఫోకస్ పెట్టాడు. దీపావళి సందర్భంగా విడుదలైన తన కొత్త సినిమా 'బైకర్' టైటిల్ పోస్టర్, ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి అభిలాష్ కన్కరా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో శర్వానంద్ ప్రొఫెషనల్ మోటార్‌సైకిల్ రేసర్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నిజంగా ప్రశంసనీయమైంది. ఇటీవల విడుదలైన ఫోటోషూట్ చిత్రాల్లో షర్ట్‌లెస్‌గా కనిపించిన శర్వా తన సిక్స్‌ప్యాక్ యాబ్స్‌తో అందరినీ షాక్‌కు గురి చేశాడు. సాధారణంగా "చాకొలేట్ బాయ్" ఇమేజ్‌తో ఉండే శర్వా, ఈసారి మాస్ అండ్ ఇంటెన్స్ లుక్‌తో కొత్త ఇంప్రెషన్ సృష్టించాడు. ఫ్యాన్స్ సోషల్ మీడియాలో "శర్వా లుక్ మైండ్ బ్లోయింగ్!", "అనుకోని ట్రాన్స్‌ఫర్మేషన్!" అంటూ కామెంట్స్‌తో ముంచెత్తుతున్నారు. ఈ లుక్ కోసం శర్వానంద్ నెలల తరబడి కఠినమైన జిమ్ వర్కౌట్స్, కంట్రోల్డ్ డైట్ పాటించారని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఆ క్రమశిక్షణ, డెడికేషన్ ఫలితంగా ఈ ఫిట్ అండ్ ఫియర్స్ లుక్ వచ్చిందని ఫిట్‌నెస్ ఎక్స్‌పర్ట్స్ కూడా ప్రశంసిస్తున్నారు. ఇక శర్వానంద్ నటిస్తున్న బైకర్ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తోంది. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. జి. యువరాజ్ సినిమాటోగ్రఫీని అందిస్తుండగా, సంగీతం: ఘిబ్రాన్, ఎడిటింగ్: అనిల్ కుమార్ పి, ఆర్ట్ డైరెక్షన్: ఏ. పన్నీర్ సెల్వం, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్. సందీప్. శర్వానంద్ చివరిసారి సూపర్‌హిట్ అందుకున్నది "శతమానం భవతి", "మహానుభావుడు చిత్రాలతో. ఇప్పుడు 'బైకర్'తో మరోసారి మంచి హిట్ కొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఫస్ట్ లుక్‌తోనే పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసిన ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215